


'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

www.rajamudranews.com
అక్షర
# రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575

మేడ్చల్-మల్కాజ్ గిరి | మంగళవారం | 13-10-2026 | సంపుటి: 3 | సంచిక: 249 | పేజీలు : 8 | వెల : 2/-
MEDCHAL-MALKAJGIRI | TUESDAY | 13-10-2026 | VOLUME : 3 ISSUE : 249 | PAGES: 8 | COST: 2/-

## ఎల్నినో పరిస్థితులు పట్టని ప్రభుత్వం

- రైతులతో పిల్లలాటలు ఆడుతున్నారా?
- వలస పోతున్న రైతుకూలీలు
- బొగ్గు, విద్యుత్ కొరతకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం
- ముఖ్యమంత్రి ఢిల్లీ ఎందుకెళ్లారు?
- రైతుల సమస్య కంటే పార్టీ కార్యక్రమాలే ప్రధానమా?
- రైతులకు శాపంగా మారిన పాలన
- కరువు కోరల్లో చిక్కుకున్న వరంగల్ జిల్లా
- ప్రభుత్వంపై విరుచుకుపడ్డ హరీష్ రావు

**హైదరాబాద్, అక్టోబర్ 12:**
కరువు, ఎల్ నీ నో పరిస్థితులు రాష్ట్రంలో ఉంటే ప్రభుత్వం పట్టింపులేనితనంతో వుందని మాజీ మంత్రి హరీష్ రావు విమర్శించారు. తెలంగాణ భవన్లో మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రైతులంతా ఈరోజు ఉదయం 11 గంటలకు రైతు వేదికలకు రావాలని, సీఎం మాట్లాడతారు అని నిన్న మెసేజ్ లు పంపారు. 12 గంటలకు సీఎం వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని

మిగతా 3వ పేజీలో..






## 'సర్' పేరుతో వోటు
# చోరీకి కుట్ర

- ఇది మరో స్వాతంత్ర్య పోరాటం
- 'సైమన్ గో బ్యాక్' స్ఫూర్తితో 'జ్ఞానేశ్ గో బ్యాక్' ఉద్యమం
- మైనారిటీ, దళిత, గిరిజన, పేదల వోట్ల తొలగింపునకు యత్నం
- వోటు చోరీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ నేతృత్వంలో తీవ్ర పోరు
- ఆయనతో కలిసి కదం తొక్కాలి
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**దిల్లీ, అక్టోబర్ 12:**
దేశ ప్రజల వోటు హక్కును కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాటం మరో స్వాతంత్ర్య ఉద్యమమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల నాయకత్వంలో ఈ పోరాటం కొనసాగుతోందని తెలిపారు. బ్రిటిష్ పాలన నుంచి దేశానికి స్వేచ్ఛ, స్వపరిపాలన కల్పించేందుకు ఆనాడు కాంగ్రెస్ నాయకులు పోరాడారని, ఇప్పుడు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకునేందుకు పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీఎం తెలిపారు. వోటు బచావో.. దేశ్ బచావో ఆందోళనలో భాగంగా

మిగతా 2వ పేజీలో..



## బీజేపీ మాత్రమే గెలిచేలా అక్రమాలు

2

- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే మా పోరాటం : డిప్యూటీ సీఎం భట్టి

## కేసీఆర్ బాటలోనే మోదీ..

- ధర్నా చౌక్ ఎత్తేసిన కేసీఆర్ కు పట్టిన గతే మోదీకి పడుతుంది
- ప్రజల గొంతు నొక్కిన పాలకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు : పొంగులేటి

2

## సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్షాల మహా ప్రదర్శన

- రాహుల్, ప్రియాంక నేతృత్వంలో భారీ ర్యాలీని అడ్డుకున్న దిల్లీ పోలీసులు
- అంచనాలకు మించి పాల్గొన్న నిరసనకారులు
- ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు
- 11 మంది ఇండియా కూటమి నేతల సంతకాలు
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఎస్ఐఆర్ నిలిపివేతకు డిమాండ్
- రాహుల్ వెంట విద్యార్థి నాయకురాలు నేహా బోరా
- భగవాన్ దాస్ రోడ్డులో పోలీసు బారికేడ్లు
- జంతర్ మంతర్ లో నిరసనలకు అనుమతులు రద్దు

4



## అంతర్జాతీయ శాసనసభల మధ్య సహకారం అవశ్యం



3

## కేబీఆర్ పార్కు చుట్టూ ఎలివేటెడ్ కారిడార్

- రూ.1,090 కోట్లతో 4.3 కిలోమీటర్ల మేర నిర్మాణానికి ప్రణాళిక
- నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు కారిడార్
- భూసేకరణకు బాలకృష్ణ, శబ్లాయ, భవ్య కన్‌స్ట్రక్షన్స్ అంగీకారం
- రోడ్డు నంబర్ 45, ఫిల్మ్‌నగర్ జంక్షన్ల అభివృద్ధిపై దృష్టి



2



## పోలీసింగ్ కూడా మారాలి

- ప్రజల కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకే: డీజీపీ సీవీ ఆనంద్
- 112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్
- శిక్షణ పొందుతూనే యూపీఎస్సీకి ఎంపికైన ఇద్దరు అధికారులు

3

## రూ.20 లక్షల లంచం తీసుకుంటూ సర్వేయర్ అరెస్ట్

- తొలుత రూ.30 లక్షలు డిమాండ్.. బేరసారాలతో రూ.20 లక్షలకు ఒప్పందం
- తహసీల్దార్ ఆదేశాలతోనే లంచం తీసుకున్నట్లు ఏసీబీ గుర్తింపు



3

## ఫారం-6పై తీర్పు ఇవ్వలేదు.. ఈసీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- కోర్టు తీర్పును తప్పుగా ప్రస్తావించడంపై సీజేఐ అసహనం
- దరఖాస్తుల్లో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలిస్తామని వెల్లడి
- సెప్టెంబర్ 26న ఈసీ విడుదల చేసిన ప్రకటనపై మరోసారి స్పష్టత

4





## అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు

- భక్తిశ్రద్ధలతో పాటలు పాడిన మహిళలు
- పాల్గొన్న స్పీకర్ ప్రసాద్ కుమార్, మండలి చైర్మన్ గుత్తా

2

## జంతర్ మంతర్‌లో ధర్నాలు, నిరసనలపై నిషేధం

- ట్రాఫిక్ ఇబ్బందులు, భద్రతా కారణాలతో ఢిల్లీ పోలీసుల నిర్ణయం
- ల్యుటియన్స్ ఢిల్లీలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని వెల్లడి
- నిరసనలకు ప్రత్యామ్నాయంగా మూడు వేదికల కేటాయింపు

4



## ఎన్‌హెచ్65 విస్తరణను వేగవంతం చేయాలి

- ఎన్‌హెచ్ఏఐ చైర్మన్‌ను కోరిన మంత్రి కోమటిరెడ్డి
- 2027 జనవరి నాటికి పనులు ప్రారంభిస్తామని చైర్మన్ హామీ

3



## కరువు వేళ దిల్లీ టూర్లెందుకు?

- కేబినెట్ రద్దు చేసి వెళ్లడం బాధ్యతారాహిత్యం
- ఓట్ల గల్లంతుపై మంత్రి పొన్నంకు బహిరంగ సవాల్
- సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ చీఫ్ రామచందర్ రావు ఫైర్
- ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవపై బీజేపీ అభినందన తీర్మానం

2

## రాజ్యాంగ వ్యవస్థలపై 'ఇండి' కూటమి ముప్పేట దాడి

2

- బోగస్ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్, ఆప్ ద్వంద్వ నీతి బట్టబయలు
- గతంలో వారి డిమాండ్ మేరకే ఓటర్ల జాబితా ప్రక్షాళన
- తెలంగాణ రైతుల సమస్యలు వదిలేసి దిల్లీలో ధర్నాల డ్రామాలు: డాక్టర్ లక్ష్మణ్ ధ్వజం

# కేసీఆర్ బాటలోనే మోదీ..



- ధర్నా చౌక్ ఎత్తేసిన కేసీఆర్ కు పట్టిన గతే మోదీకి పడుతుంది
- ప్రజల గొంతు నొక్కిన పాలకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు
- మంత్రి పొంగులేటి

హైదరాబాద్, అక్టోబర్ 12 :

తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన అదే విధానాన్ని ఇప్పుడు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. దేశ రాజధాని ఢిల్లీలో ప్రజలు, రాజకీయ పార్టీలు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేసేందుకు చారిత్రకంగా ఉపయోగించుకున్న జంతర్ మంతర్ వంటి నిరసన వేదికలపై ఆంక్షలు విధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో నిరసన వేదికను తొలగిస్తే.. మోదీ ప్రభుత్వం దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలకు ఆంక్షలు విధిస్తోందని, ఇద్దరి ఆలోచనా విధానం ఒక్కటేనని మంత్రి మండిపడ్డారు. ప్రజల సమస్యలను వినకుండా, ప్రతిపక్షాల గొంతును వినిపించకుండా, నిరసనలకు వేదిక లేకుండా చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ప్రజల గొంతును అణచివేయాలని చూసిన కేసీఆర్ కు ఎలాంటి రాజకీయ పరిణామం ఎదురైందో అదే పరిస్థితి భవిష్యత్తులో నరేంద్ర మోదీకి కూడా ఎదురవుతుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రజల గొంతును అణచివేసే ప్రతి పాలకుడికి చివరకు ప్రజల తీర్పే సమాధానం అని మంత్రి హెచ్చరించారు.

# రాజ్యాంగ వ్యవస్థలపై 'ఇండి' కూటమి ముప్పేట దాడి

- బోగస్ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్, ఆప్ ద్వంద్వ నీతి బట్టబయలు
- గతంలో వారి డిమాండ్ మేరకే ఓటర్ల జాబితా ప్రక్షాళన
- తెలంగాణ రైతుల సమస్యలు వదిలేసి ఢిల్లీలో ధర్నాల డ్రామాలు-
- డాక్టర్ లక్ష్మణ్ ధ్వజం



హైదరాబాద్, అక్టోబర్ 12 :

ఎన్నికల్లో ప్రజా మద్దతు పొందలేక రాజ్యాంగబద్ధమైన ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థలపై నిరాధార ఆరోపణలు చేస్తూ వ్యవస్థలను నిర్వీర్యం చేసే కుట్రలకు కాంగ్రెస్ పార్టీ, 'ఇండి' కూటమి తెరలేపిందని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. గతంలో మధ్యప్రదేశ్, గుజరాత్, ఢిల్లీ, కేరళ తదితర రాష్ట్రాల్లో లక్షలాది బోగస్ ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని కాంగ్రెస్, ఆప్ నేతలే ఈసీకి వినతిపత్రాలు ఇచ్చారని లక్ష్మణ్ గుర్తుచేశారు. ఆనాడు దొంగ ఓట్లను ఏరివేయాలని డిమాండ్ చేసి ఇప్పుడు చట్టబద్ధంగా సమగ్ర సవరణ ప్రక్రియ చేపడితే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందంటూ వీధుల్లోకి రావడం వారి అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమన్నారు. చనిపోయిన వారి ఓట్లను, డబుల్ ఎంట్రీ ఉన్న ఓట్లను తొలగిస్తుంటే అడ్డుపడటం వెనుక దొంగ ఓట్లతో గెలవాలనే కాంగ్రెస్ దురుద్దేశం ఉందని విమర్శించారు.

**న్యాయ వ్యవస్థను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు**

ఓటర్ల సవరణ ప్రక్రియను సుప్రీంకోర్టు స్వయంగా సమర్థించినప్పటికీ దాదాపు 42 మంది రిటైర్డ్ న్యాయమూర్తులు కాంగ్రెస్ నిరాధార ఆరోపణలను తప్పుపట్టినప్పటికీ వారి తీరు మారలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ముందే ధర్నాలు చేస్తామని ప్రకటించడం న్యాయ వ్యవస్థను బ్లాక్‌మెయిల్ చేయడమేనని దుయ్యబట్టారు. 1957 బెగుసరాయ్ బూత్ క్యాప్చరింగ్ నుంచి 1975 నాటి ఎమర్జెన్సీ విధింపు, ఆర్టికల్ 356 దుర్వినియోగం, ఎంపీల కొనుగోలు వరకు కాంగ్రెస్‌ది ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన నల్ల చరిత్ర అని విమర్శించారు.

**రైతులను గాలికొదిలేసిన రేవంత్ ప్రభుత్వం**

తెలంగాణలో తీవ్ర వర్షాభావం వల్ల పంటలు ఎండిపోయి, సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్ రాక రైతాంగం సంక్షోభంలో ఉంటే, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రజా సమస్యలను గాలికొదిలేసి అధిష్టానం మెప్పు కోసం ఢిల్లీ ధర్నాల పేరిట నాటకాలు ఆడుతున్నారని లక్ష్మణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో ఓట్ల సవరణ ప్రక్రియ అంతా స్థానిక ప్రభుత్వ ఉద్యోగులు, అన్ని పార్టీల బూత్ లెవల్ ఏజెంట్ల సమక్షంలోనే జరిగిందని స్పష్టం చేశారు. ఎలక్షన్ కమిషన్ సవరణ ప్రక్రియపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని, రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే చర్చకు రావాలని సవాల్ విసిరారు.

# కేబీఆర్ పార్కు చుట్టూ ఎలివేటెడ్ కారిడార్

హైదరాబాద్, అక్టోబర్ 12:

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అధికారులు ప్రణాళిక రూపొందించారు. కేబీఆర్ పార్కు చుట్టూ రూ.1,090 కోట్లతో చేపట్టాలనుకున్న హెచ్‌సీటీ ప్రాజెక్టు రద్దు కావడంతో ప్రత్యామ్నాయంగా ఈ కారిడార్‌ను ప్రతిపాదించారు. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు సుమారు 4.3 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ మార్గంతో బంజారాహిల్స్ నుంచి హైటెక్ సిటీ, మైండ్‌స్పేస్ వైపు వెళ్లే వాహనదారులకు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయి.

**భూసేకరణకు ప్రముఖుల సమ్మతి**

కారిడార్ నిర్మాణంతోపాటు ప్రధాన కూడళ్ల విస్తరణకు ప్రైవేట్ స్థలాలను సేకరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పలువురు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు సమాచారం. రోడ్డు నంబర్ 45 కూడలి అభివృద్ధి కోసం సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన నివాసానికి చెందిన 862.77 చదరపు గజాల స్థలాన్ని ఇచ్చేందుకు అంగీకరించారు. దీంతో ఆయన నివాసాన్ని మరో ప్రాంతానికి మార్చాల్సి ఉంటుంది. ఈ ఇంటితో నందమూరి కుటుంబానికి భావోద్వేగ అనుబంధం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**శబ్దాలయ, ఫిల్మ్‌నగర్ జంక్షన్ల అభివృద్ధి**

శబ్దాలయ స్టూడియో జంక్షన్ అభివృద్ధికి అవసరమైన భూసేకరణకు సంబంధించి కూడా అంగీకారాలు లభించినట్లు సమాచారం. ఫిల్మ్‌నగర్ జంక్షన్ విస్తరణ కోసం భవ్య కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన 341.33 చదరపు గజాల స్థలాన్ని సేకరించాల్సి ఉండగా, సంస్థ యజమాని ఆనంద్‌ప్రసాద్ భూమి ఇచ్చేందుకు సమ్మతించారు.

**టీడీఆర్‌తో పరిహారం**

రహదారుల విస్తరణ, కూడళ్ల అభివృద్ధి కోసం ప్రైవేట్ భూములను సేకరించే సందర్భాల్లో నగదు పరిహారానికి బదులుగా ప్రభుత్వం ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) సర్టిఫికెట్లు జారీ చేయవచ్చు. వీటి ద్వారా భూమి యజమానులు నిబంధనలకు అనుగుణంగా ఇతర ప్రాంతాల్లో అదనపు నిర్మాణ హక్కులను వినియోగించుకోవచ్చు లేదా వాటిని ఇతరులకు బదిలీ చేయవచ్చు. ఈ విధానం ద్వారా భూసేకరణ ప్రక్రియను సులభతరం చేయడంతోపాటు ప్రభుత్వంపై తక్షణ ఆర్థిక భారం తగ్గే అవకాశం ఉంది.

# 'సర్' పేరుతో వోటు చోరీకి కుట్ర

మొదటిపేజీ తరువాయి

ఢిల్లీ తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఆనాడు స్వాతంత్ర్యం కోసం 'సైమన్ గో బ్యాక్' ఉద్యమం సాగిందని, ఇప్పుడు వోటు హక్కును కాపాడుకునేందుకు 'జ్ఞానేశ్ గో బ్యాక్', 'సర్ గో బ్యాక్' నినాదాలతో ఉద్యమించాల్సిన అవసరం వచ్చిందని అన్నారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ముందుపెట్టి, ఓటర్ల జాబితా సవరణ పేరుతో ప్రజల ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం ఆరోపించారు.

గతంలోనూ ప్రత్యేక సమగ్ర వోటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరిగిందని ఆయన గుర్తు చేశారు. 1950లో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానిగా ఉన్న సమయంలో ఈ ప్రక్రియ ద్వారా వోటు హక్కు లేని వారికి ఓటు హక్కు కల్పించగా ఇప్పుడు మోదీ, అమిత్ షాల పాలనలో మాత్రం ఇప్పటికే వోటు హక్కు ఉన్నవారి పేర్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని సీఎం మండిపడ్డారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా, నిష్పక్షపాతంగా పనిచేయాల్సిన రాజ్యాంగబద్ధ సంస్థ అని అన్నారు. అలాంటి సంస్థను రాజకీయ అవసరాలకు ఉపయోగించుకోవడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని సీఎం హితవు పలికారు. ఎన్నికల సంఘం విశ్వసనీయత దెబ్బతింటే ప్రజాస్వామ్య గతంలో ఎన్నికల కమిషనర్ల నియామకంలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేవారని తెలిపారు. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ప్రధాన ప్రతిపక్ష నేత భాగస్వామ్యంతో నియామక ప్రక్రియ సాగేదన్నారు. మోదీ ప్రభుత్వం 2023లో ఈ విధానాన్ని మార్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. కమిషనర్ల నియామక ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో కేంద్ర హోం మంత్రిని చేర్చారని ఆరోపించారు. నిర్ణయాలను తమకు అనుకూలంగా తీసుకునేందుకే ఈ మార్పులు చేశారని సీఎం మండిపడ్డారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో నిష్పక్షపాతానికి భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమించే సమయంలోనే రాహుల్‌గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. జ్ఞానేశ్‌తో సర్ ద్వారా వోటర్ల తొలగింపునకు అవకాశం కల్పిస్తున్నారని సీఎం ఆరోపించారు.

**బీజేపీ, కేంద్రానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారి వోటు తొలగించే యోచన**

సోషల్ మీడియాలో బీజేపీ, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టేవారిని లక్ష్యంగా చేసుకుని వారి వోటు హక్కులను తొలగించే యోచనలో ఉందని సీఎం విమర్శించారు. ఈ ప్రమాదాన్ని తొలుత గుర్తించి దేశ ప్రజల దృష్టికి తీసుకొచ్చింది రాహుల్ గాంధీయేనని సీఎం వెల్లడించారు. మొదట్లో ప్రతిపక్ష పార్టీలు ఈ అంశంపై తగినంతగా దృష్టి పెట్టలేదని, తాజా పరిణామాలతో పరిస్థితి తీవ్రత అందరికీ అర్థమవుతోందన్నారు. ప్రతిపక్ష పార్టీలే కాకుండా అధికార పక్షంలో ఉన్నవారు కూడా ఈ అంశంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారని అన్నారు. బీజేపీ సీనియర్ నేత మురళీ మనోహర్ జోషి వంటి వారు ఈ అంశంపై గొంతెత్తడమే ఇందుకు సంకేతమని సీఎం వ్యాఖ్యానించారు. జ్ఞానేశ్ కుమార్ నియామకంలో ఎలాంటి కుట్ర లేదని మోదీ, అమిత్ షాలు భావిస్తే,ఆయనను తొలగించాలనే డిమాండ్లపై ఎందుకు స్పందించడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వారు ఎందుకు అండగా నిలుస్తున్నారో సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా ప్రజలు ఆందోళనలు చేపడితే ఎందుకు అడ్డుకుంటున్నారని, నిరసనలను ఎందుకు అణచివేస్తున్నారని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఢిల్లీలో భారీగా పోలీసులను ఎందుకు మోహరిస్తున్నారో వివరించాలన్నారు. జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలో జరుగుతున్న చర్యల వల్ల రాజకీయంగా లబ్ధి పొందుతున్నది బీజేపీ మాత్రమేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. బీజేపీకి కొంతమేర బలం ఉన్న రాష్ట్రాల్లో ఆ పార్టీ విజయాలకు వోటర్ల జాబితాలో జరుగుతున్న మార్పులు కూడా కారణమనే అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. వోటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత ఉండాలని, అర్హులైన వోటర్ల పేర్లు తొలగించకుండా చర్యలు తీసుకోవాలని సీఎం డిమాండ్ చేశారు.

**13 కోట్ల వోట్లను తొలగించారు**

2014లో నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రి పదవికి పోటీ చేసిన సమయంలో దేశంలో సుమారు 81 కోట్ల మంది వోటర్లు ఉన్నారని, 2019లో ఈ సంఖ్య సుమారు 91 కోట్లకు, 2024 ఎన్నికల నాటికి సుమారు 97 కోట్లకు చేరిందని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. 2026లో ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఈ తొలగించే వోట్ల సంఖ్యను 20 కోట్లకు పెంచే కుట్ర ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. 2014లో దేశ జనాభా ఎంత? ప్రస్తుతం ఎంత? అనే వివరాలను పరిశీలించాలన్నారు. ఈ అంశంపై రాష్ట్రపతి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించాలని కోరారు. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలు ప్రజల సందేహాలను నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని సీఎం అన్నారు. దేశంలో టు హక్కు ఉన్నవారు, ఓటు హక్కు లేనివారనే రెండు వర్గాలను సృష్టించే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలను శ్రీమంతులు, పేదలు అనే వర్గాలుగా విడదీసి, పేదల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. సంపన్నులు బీజేపీకి మద్దతుగా ఉంటారని, పేదలు ఆ పార్టీకి వ్యతిరేకంగా ఉంటారనే రాజకీయ లెక్కలతో వోటర్ల పేర్లను తొలగిస్తున్నారనే అనుమానాలు ఉన్నాయన్నారు. వోటు హక్కును తొలగించడం ద్వారా కొన్ని వర్గాల ప్రజలను రెండో తరగతి పౌరులుగా మార్చే ప్రయత్నాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగం కల్పించిన సమాన హక్కులు ప్రతి పౌరుడికీ అందాలని, పేదలు, దళితులు, గిరిజనులు సహా అన్ని వర్గాల ప్రజలకు వోటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు. గాంధీ కుటుంబం దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిందని, ఇప్పుడు అదే కుటుంబానికి చెందిన రాహుల్‌గాంధీ 'వోట్ చోరీ' ప్రచారం ద్వారా ప్రజల ఓటు హక్కును కాపాడేందుకు పోరాటం చేస్తున్నారని సీఎం తెలిపారు. అందులో భాగంగానే తాము ఢిల్లీకి వచ్చి నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నామని చెప్పారు.ఓటర్ల జాబితా నుంచి అర్హులైన వారి పేర్లను తొలగించే ప్రయత్నాలను తక్షణమే నిలిపివేయాలని, ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఏఐసీసీ పరిశీలకులు సచిన్ సావంత్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కరువు వేళ ఢిల్లీ టూర్లెందుకు?

- కేబినెట్ రద్దు చేసి వెళ్లడం బాధ్యతారాహిత్యం
- ఓట్ల గల్లంతుపై మంత్రి పొన్నంకు బహిరంగ సవాల్
- సీఎం రేవంత్ రెడ్డిపై బీజేపీ చీఫ్ రామచందర్ రావు ఫైర్
- ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా సేవపై బీజేపీ అభినందన తీర్మానం



హైదరాబాద్, అక్టోబర్ 12:

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర కరువు నెలకొని, రైతులు అల్లాడుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అత్యవసర కేబినెట్ భేటీని రద్దు చేసుకుని ప్రత్యేక విమానాల్లో ఢిల్లీకి వెళ్లడం బాధ్యతారాహిత్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్రంగా విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పలువురు నేతలతో కలిసి ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. వోట్లు గల్లంతయ్యాయంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన ఆరోపణలను ఆయన తిప్పికొట్టారు. వేల మంది అవసరం లేదని, కనీసం వోట్లు కోల్పోయిన 10 మందిని సీఈవో ఆఫీసుకు తీసుకువస్తే రికార్డులు పరిశీలించేందుకు తాను సిద్ధమని సవాల్ విసిరారు. నోటీసు ఇవ్వకుండా, విచారణ జరపకుండా ఏ ఒక్క వోటూ డిలీట్ కాదని, అర్హులైన వారి వోటు తొలగించబడిందని నిరూపిస్తే అక్కడికక్కడే నమోదు చేయిద్దామని, నిరూపించలేకపోతే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**రాముడి పేరు ఎత్తే అర్హత లేదు**

గోవా పర్యటనలో బీజేపీని రావణుడితో, కాంగ్రెస్‌ను రాముడితో సీఎం రేవంత్ రెడ్డి పోల్చుకోవడం హాస్యాస్పదమని రామచందర్ రావు అన్నారు. గతంలో శ్రీరాముడు కాల్పనిక పాత్ర అని కోర్టులో అఫిడవిట్ వేసిన కాంగ్రెస్ పార్టీకి రాముడి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. "ముస్లిం ఈజ్ కాంగ్రెస్.. కాంగ్రెస్ ఈజ్ ముస్లిం" అని గతంలో చెప్పిన రేవంత్ రెడ్డికి రాముడి పేరు ఎత్తే అర్హతే లేదని మండిపడ్డారు.

**ప్రధాని మోదీకి అభినందనలు**

ప్రజా జీవితంలో ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల (గుజరాత్ సీఎంగా 12.5 ఏళ్లు, ప్రధానిగా 12 ఏళ్లు) నిస్వార్థ సేవలు పూర్తి చేసుకున్న సందర్భంగా తెలంగాణ బీజేపీ పక్షాన ఆయనకు అభినందనలు తెలుపుతూ ప్రత్యేక తీర్మానం చేసినట్లు చెప్పారు. గత పన్నెండున్నర ఏళ్లలో కేంద్రం తెలంగాణ అభివృద్ధికి రూ.13 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎన్.గౌతంరావు, వీరేందర్ గౌడ్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఆరు గ్యారెంటీలు అమలయ్యే వరకు రాహుల్‌ని అడ్డుకుంటాం**

రాష్ట్రంలో గంజాయి, కొకైన్, ఎండీఎంఏ వంటి మత్తు పదార్థాలు విచ్చలవిడిగా దొరుకుతూ తెలంగాణ డ్రగ్స్ మార్కెటింగ్ సెంటర్‌గా మారిందని ఆయన ఆరోపించారు. వీటిని కట్టడి చేయలేని ముఖ్యమంత్రి పక్క రాష్ట్రాల్లో నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను రైతులు, దళితులు, బీసీలకు అమలు చేసే వరకు రాహుల్ గాంధీని తెలంగాణలో అడుగుపెట్టనివ్వబోమని హెచ్చరించారు.

# అంబరాన్ని అంటిన బతుకమ్మ సంబరాలు

హైదరాబాద్, అక్టోబర్ 12 :

బతుకమ్మ పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతికి ప్రతీక అని శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శమని శాసనమండలి చైర్మన్ గుత్తా ఖేందర్ రెడ్డి కొనియాడారు. అసెంబ్లీ ప్రాంగణంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్ని తాకాయి. ఈ సంబరాల్లో ప్రసాద్ కుమార్, సుఖేందర్ రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్ పాల్గొని ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడారు. బంతి, చామంతి, గునుగు, తంగేడు పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను మధ్యలో ఉంచి, మహిళా ఉద్యోగులు, సిబ్బంది చుట్టూ చేరి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడారు. ఆడబిడ్డల ఆత్మీయత, ఉత్సాహం మధ్య సాగిన ఈ వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. అసెంబ్లీ ప్రాంగణం సోమవారం సాయంత్రం రంగురంగుల పూలతో, ఆడపడుచుల ఆనంద కోలాహలంతో కళకళలాడింది. బతుకమ్మ వేడుకల్లో శాసనమండలి సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు శాసనసభ సెక్రటరీ ఆర్.తిరుపతి, శాసనసభ, శాసనమండలి ఉన్నతాధికారులు, మహిళా ఉద్యోగులు, ఇతర సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బీజేపీ మాత్రమే గెలిచేలా అక్రమాలు

- ఎస్ఐఆర్‌తో ఎన్నికల కమిషన్ ద్వారా దుశ్చర్యలు
- ఓటు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలో కాంగ్రెస్ సత్యాగ్రహం
- ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే మా పోరాటం : డిప్యూటీ సీఎం భట్టి



న్యూఢిల్లీ, అక్టోబర్ 12 :

భారతీయ జనతా పార్టీ(బీజేపీ) మాత్రమే గెలిచేందుకు అవకాశం ఉండేలా ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఎన్నికల కమిషన్ ద్వారా అక్రమాలు జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. దేశ పౌరుల ఓటు హక్కును పరిరక్షించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందని స్పష్టం చేశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) పిలుపు మేరకు ఢిల్లీలో సోమవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. స్వతంత్ర భారతదేశంలో ప్రజాస్వామ్యానికి పౌరుల ఓటు హక్కు అత్యంత బలమైన పునాది అని పేర్కొన్నారు. ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రాథమిక హక్కును కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో ఓటు హక్కుకు విఘాతం కలిగించే అక్రమాలు జరుగుతున్నాయని, ప్రజాస్వామ్య వ్యవస్థలో బీజేపీ మాత్రమే గెలిచే పరిస్థితులు కల్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అంశాలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొంతకాలంగా దేశ ప్రజల దృష్టికి తీసుకొస్తున్నారని తెలిపారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నాయకత్వంలో దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. ఈ పోరాటం కాంగ్రెస్ పార్టీకి లేదా ఆ పార్టీ నాయకులకు సంబంధించిన ఓట్ల కోసం మాత్రమే కాదని, దేశంలోని ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడేందుకునని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**గాంధేయ మార్గంలో సత్యాగ్రహం**

ఓటర్ల హక్కులకు సంబంధించిన సమస్యలను వివిధ రాజ్యాంగ సంస్థల దృష్టికి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ గతంలోనూ ప్రయత్నించిందని భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రపతిని కలిసి వినతులు సమర్పించడంతోపాటు సంబంధిత వ్యవస్థల దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లామని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే మరో రాజ్యాంగ వ్యవస్థ దృష్టికి ఓటు హక్కుల పరిరక్షణ అంశాన్ని తీసుకెళ్లేందుకు ఢిల్లీలో శాంతియుతంగా, గాంధేయ మార్గంలో సత్యాగ్రహం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

**తెలంగాణ కాంగ్రెస్ నేతల భారీ భాగస్వామ్యం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ నేతృత్వంలో తెలంగాణ నుంచి మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, పార్లమెంటు సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళా కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, సేవాదళ్ తదితర అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో ఢిల్లీ నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు, పౌరుల ఓటు హక్కును కాపాడేందుకు అందరూ ఐక్యంగా ముందుకు రావాలని భట్టి విక్రమార్క ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# ఎన్నినో పరిస్థితులు పట్టని ప్రభుత్వం

**మొదటిపేజీ తరువాయి**

నిన్న రాత్రి ఎమ్మెల్యేలకు మెసేజ్ పంపారు. ఉదయం 9.52 నిమిషాలకు వీడియో కాన్ఫరెన్స్ రద్దు అని పంపారు. మళ్లీ 11 గంటలకు ఉంటుందని మెసేజ్ ఇచ్చారు. ఆ తర్వాత మళ్లీ రద్దు చేశారు. ఇప్పుడు మధ్యాహ్నం ఒంటి గంటకు సీఎం రాడు కానీ డిప్యూటీ సీఎం వస్తాడు అని చెబుతున్నారు. రాష్ట్ర రైతులతో చిన్న పిల్లల ఆటలాడుతున్నారా? మొన్న ముఖ్యమంత్రి అధ్యక్షతన సమావేశం ఉంటుందని పొంగులేటి చెప్పారు. సీరియస్ గా మాట్లాడతాం అన్నారు. నిన్న ముఖ్యమంత్రి గోవా వెళ్లారు. మంత్రులు ఢిల్లీ వెళ్ళారు. పొంగులేటి మాటలు తుస్సు అయ్యాయి. వ్యవసాయ శాఖ అధికారులు రైతులందరూ రావాలని పిలిచారు. ఆ తర్వాత టెక్నికల్ సెషన్ అన్నారు. తర్వాత సీఎస్, ఆ తర్వాత డిప్యూటీ సీఎం మాట్లాడతారని చెప్పారు. ఇంత తీవ్రమైన సమస్యపై ప్రభుత్వానికి ఉన్న బాధ్యత ఇదేనా? కేబినెట్ సమావేశం లేదు.. వీడియో కాన్ఫరెన్స్ కూడా సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి.. రైతుల పట్ల, రాష్ట్రం పట్ల ఈ ప్రభుత్వానికి ఎంత బాధ్యత ఉందో అర్థమవుతోంది అని విమర్శించారు. ఎల్ నినో ప్రభావంపై గత తొమ్మిది నెలలుగా ప్రపంచ శాస్త్రవేత్తలు, భారత ప్రభుత్వ సంస్థలు హెచ్చరిస్తున్నా ఈ ప్రభుత్వం మొద్దు నిద్రపోయింది. తొమ్మిది నెలలుగా రైతుల కోసం తీసుకున్న చర్యలేంటో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పంటలు వేయొద్దంటూ లీకులు ఇప్పించి వార్తలు రాయిస్తున్నారు. రైతులు పంటలు వేయకపోతే ఏం చేయాలి? రైతు కూలీల పరిస్థితి ఏంటి? రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలు ఎలా బతకాలి? ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో బల్లలు చరిచారు తప్ప క్షేత్రస్థాయిలో ఏం చేశారు అని ప్రశ్నించారు. కాంట్రాక్టులు, విదేశీ పర్యటనలకు సమయం ఉంటుంది కానీ, పేదలకు భరోసా కల్పించడానికి సమయం లేదా అని నిలదీశారు. అసలు ప్రత్యామ్నాయ కార్యాచరణ ఏది? తుమ్మల, పొంగులేటి రైతులకు ఉచిత సలహాలు ఇవ్వడం కాదు.. ప్రభుత్వం ఏం చేయబోతుందో స్పష్టంగా చెప్పాలన్నారు. రైతులు, రైతు కూలీలు వలసలు పోవాలా? గద్వాల జిల్లాకు చెందిన పలువురు కూలీలు కర్ణాటకకు వలస వెళ్లి రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. వారిలో ఇద్దరు, ముగ్గురు ప్రాణాలు కోల్పోగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఎక్కువమంది దళిత బిడ్డలే. మేం అధికారంలో ఉన్నప్పుడు వలసలు పోయిన వారిని తిరిగి తీసుకొచ్చాం. కాంగ్రెస్ పాలనలో మళ్లీ పొట్ట చేత పట్టుకుని వలసలు వెళ్లే పరిస్థితి వచ్చింది. ఇది ప్రభుత్వ వైఫల్యం కాదా? యాసంగిలో పంటలు వేయొద్దంటే రైతులు, రైతు కూలీలు ఎలా బతకాలి? కేబినెట్ సమావేశం నిర్వహించి స్పష్టమైన నిర్ణయం తీసుకోలేరా? రైతుల సమస్యల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని ఢిల్లీకి వెళ్తారా? ముఖ్యమంత్రి ఢిల్లీలో ఉంటే కనీసం వీడియో కాన్ఫరెన్స్‌లోనైనా పాల్గొనలేరా? రైతులకు భద్రత కల్పించాలి. భరోసా ఇవ్వాలి. కానీ ఈ ప్రభుత్వం రైతులను భయపెడుతోంది. ఈ రెండు బాధ్యతల్లోనూ పూర్తిగా విఫలమైంది. బొగ్గు కొరతకు, విద్యుత్ కోతలకు మీ నిర్లక్ష్యమే కారణం. బొగ్గు లేదంటే ఎల్ నినో అంటారు. కరెంట్ లేదంటే ఎల్ నినో అంటారు. నీళ్లు లేవంటే ఎల్ నినో అంటారు. అసలు బొగ్గు కొరతకు ఎల్ నినోకు సంబంధం ఏమిటి? నైనీ బొగ్గు గనిలోని బొగ్గును తీసుకొచ్చి ముందుగానే నిల్వలు ఎందుకు ఏర్పాటు చేసుకోలేదు? మీ ముందుచూపు లేమి, వైఫల్యం, నిర్లక్ష్యం వల్లే ఈ దుస్థితి ఏర్పడింది. డైవర్షన్ రాజకీయాలు చేయాలంటే ముందుంటారు. కానీ రైతుల సమస్యలు పరిష్కరించాల్సి వస్తే మాత్రం పట్టించుకోరు అని వ్యాఖ్యానించారు. ఇతర రాష్ట్రాలు ముందుగానే అప్రమత్తమై విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ప్రభుత్వం మాత్రం యూనిట్‌కు రూ.10, రూ.15 పెట్టినా విద్యుత్ దొరకడం లేదని చెబుతోంది. ముందు ఎందుకు ఒప్పందాలు చేసుకోలేదు అని ప్రశ్నించారు. అక్కడ లేని కరెంట్ కొరత తెలంగాణలోనే ఎందుకు ఉంది? రాష్ట్రంలో ఏ మూలకు వెళ్లినా ఆరు నుంచి ఏడు గంటల విద్యుత్ కూడా సక్రమంగా రావడం లేదు. చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయి. పొలాల్లో ఉండాల్సిన రైతులు సబ్‌స్టేషన్ల ముందు ఆందోళనలు చేస్తున్నారు. నీళ్లు ఉన్నా మోటార్లు నడపలేని అసమర్థ ప్రభుత్వం. కృష్ణా నీళ్లను 700 వందల కిలోమీటర్ల దూరంలోని కుప్పానికి చంద్రబాబు తరలిస్తున్నడు.. కానీ తెలంగాణలో దేవాదుల ప్రాజెక్టు మోటార్లు నడపరు. కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సక్రమంగా వినియోగించరు. పాలమూరు నీళ్లను ఎత్తకుండా ఇక్కడి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేయడం వల్ల ఇతర ప్రాంతాలకు నీళ్లు తరలించే పరిస్థితి వస్తోంది అన్నారు. అందుకే రేవంత్ రెడ్డి పాలమూరు ద్రోహిగా మిగిలిపోతున్నారు. కేసీఆర్ ట్రయల్ రన్ నిర్వహించిన ప్రాజెక్టుల రిజర్వాయర్లను మూడేళ్లయినా ఎందుకు నింపలేకపోతున్నారు? సమ్మక్క సాగర్ వద్ద ఈరోజు కూడా సుమారు 30 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. దాదాపు రెండున్నర టీఎంసీల నీరు ప్రవహిస్తోంది. అలాంటి పరిస్థితిలో దేవాదుల మోటార్లు నడపమంటే ఎనిమిది గంటలే నడుపుతామని చెబుతున్నారు. మీ అసమర్థత వల్లే వరంగల్ జిల్లాలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. మోటార్లను ఆన్ అండ్ ఆఫ్ చేస్తే వాటి జీవితకాలం తగ్గుతుందని చెప్పినా పట్టించుకోలేదు. పది మోటార్లు నడవాల్సిన దేవాదులలో రెండు మోటార్ల బేరింగులు దెబ్బతిన్నాయి. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు. కల్వకుర్తిలో ఐదు మోటార్లను 24 గంటలూ నడిపితే పాలమూరులో సగం ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయవచ్చు. మూడేళ్లుగా పనులు సక్రమంగా చేసి ఉంటే పాలమూరు ప్రాజెక్టులో 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉండేది. మీ వైఫల్యం వల్లే ఈ పరిస్థితి వచ్చింది. బొగ్గు లేక కరెంట్ లేదు. కరెంట్ లేక నీళ్లు లేవు. నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. సింగూరు ప్రాజెక్టును ఎందుకు నిర్లక్ష్యం చేశారు? గత ఏడాది సింగూరు ప్రాజెక్టులో 29 టీఎంసీల నీరు ఉండేది. ప్రాజెక్టును ఏడాదిలో బాగు చేస్తామని చెప్పి, ఉన్న నీటిని వదిలేశారు. కానీ ఒక్క పని కూడా పూర్తి చేయలేదు. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాలతో పాటు హైదరాబాద్‌కు నీటిని అందించే కీలకమైన సింగూరు ప్రాజెక్టు నేడు ఖాళీగా ఉంది. మరమ్మతులు చేయడంలో ఎందుకు విఫలమయ్యారు? దీనికి బాధ్యులెవరు? బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? ప్రస్తుతం ప్రాజెక్టులో మూడు టీఎంసీల నీరు మాత్రమే ఉందని, అందులో ఒక టీఎంసీ డెడ్ స్టోరేజీ అని చెబుతున్నారు. మిగిలిన నీటిలోనూ బీర్, లిక్కర్ కంపెనీల ఉత్పత్తికి ప్రాధాన్యం ఇస్తున్నారు ఎక్సైజ్ మంత్రి లిక్కర్ ఉత్పత్తి పూర్తి స్థాయిలో ఉండాలని, ఎక్కడా నీటి కొరత లేదన్నట్లు మాట్లాడుతున్నారు. దసరాకు మద్యం కొరత ఉండకూడదట. మద్యం కంపెనీలకు నీళ్లు అందుబాటులో ఉంటాయి. కానీ తాగునీరు, సాగునీటి కోసం మాత్రం ప్రజలు ఇబ్బందులు పడాలా? బీడీఎల్, బీహెచ్‌ఈఎల్, ఐఐటీ హైదరాబాద్ వంటి సంస్థలకు నీటి వినియోగంపై నోటీసులు ఇస్తున్న పరిస్థితి ఏర్పడింది. సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేశారు. ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం రూపొందించిన కార్యాచరణ ప్రణాళిక ఏమిటి? రైతులపై కేసులు.. నీటి దుర్వినియోగంపై చర్యలేవి? వ్యవసాయం అనేది రైతులకు జీవనాధారం. జూరాలలో కళ్లముందే నీళ్లు కనిపిస్తున్నా, ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు గేట్లు తెరిచి నీళ్లు తీసుకున్న రైతులపై 14 మందికి నాన్ బెయిలబుల్ కేసులు పెట్టారు. లగచర్ల రైతుల చేతులకు బేడీలు వేశారు.

# పోలీసింగ్ కూడా మారాలి

- **ప్రజల కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకే**
- **డీజీపీ సీవీ ఆనంద్**
- **112 మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్**

**హైదరాబాద్, అక్టోబర్ 12 :**

పోలీసు యూనిఫాం ధరించడం గొప్ప అదృష్టమని, ప్రజలకు సేవ చేయడంతోపాటు వారి ప్రాణాలను కాపాడే అరుదైన అవకాశం పోలీసు శాఖలో పనిచేసేవారికి లభిస్తుందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. రాష్ట్రంలో నాలుగు కోట్ల జనాభాలో సుమారు 90 వేల మందికే పోలీసు యూనిఫాం ధరించే అవకాశం ఉందని, ఇది మొత్తం జనాభాలో 0.3 శాతం మాత్రమేనని వివరించారు. రోజూ కనీసం 50 మంది కన్నీళ్లు తుడిచే అవకాశం పోలీసులకు ఉంటుందన్నారు. నిజాయతీ, నైతిక విలువలను విస్మరించరాదని, కుల, మత, రాజకీయ రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీసు అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112మంది డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడారు. 2014 తర్వాత పూర్తిస్థాయిలో శిక్షణ ముగించుకుని బయటకు వస్తున్న తొలి డీఎస్పీ బ్యాచ్ కావడంతో దీనికి ప్రత్యేకత ఉందన్నారు. 44 వారాలపాటు చట్టాలు, దర్యాప్తు విధానాలు, ఔట్‌డోర్ శిక్షణ, క్రీడల్లో శిక్షణ పొందిన అధికారులను అభినందించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన వారిని ప్రశంసిస్తూ అకాడమీ అధికారులు, అధ్యాపకులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కొన్ని కారణాల వల్ల ముఖ్యమంత్రి పాసింగ్ అవుట్ పరేడ్‌కు హాజరు కాలేకపోతున్నట్లు తెలిపారన్నారు.

**30 ఏళ్ల వృత్తి జీవితానికి పునాది**

పాసింగ్ అవుట్ పరేడ్ సందర్భంగా చేసే ప్రమాణం అధికారుల 3035 ఏళ్ల వృత్తి జీవితానికి మార్గదర్శకంగా నిలవాలని డీజీపీ సూచించారు. రాజ్యాంగం పట్ల నిబద్ధతతో, ప్రజలకు నిజాయతీగా, రాగద్వేషాలకు అతీతంగా విధులు నిర్వహిస్తానని చేసిన ప్రమాణాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలన్నారు. అకాడమీలో శిక్షణ పూర్తయిన తర్వాత మరో 46 వారాలపాటు క్షేత్రస్థాయిలో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఈ దశలోనూ అదే శ్రద్ధ, క్రమశిక్షణ, నిజాయతీతో వ్యవహరించాలని సూచించారు.

**నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి**

మీరు నాయకులుగా ఎంపికయ్యారు.. మీ నాయకత్వ లక్షణాలను విధుల్లో నిరూపించుకోవాలని డీజీపీ అన్నారు. ధైర్యం, దార్శనికత, నైతిక విలువలు, నిష్పాక్షికత, బృంద స్ఫూర్తి, సంభాషణ నైపుణ్యాలు, కష్టపడే తత్వం, సాంకేతిక పరిజ్ఞానం, నూతన ఆలోచనలు, వినయం.. ఈ పది లక్షణాలను ప్రతి అధికారి అలవర్చుకోవాలని సూచించారు. విధుల నిర్వహణలో నైతిక విలువలను ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించరాదన్నారు.

**నేరాల తీరు మారింది.. పోలీసింగ్ మారాలి**

తాము యూనిఫాం ధరించిన రోజుల్లో నక్సలిజం ప్రధాన సవాలుగా ఉండేదని, ఆ సమస్యను పోలీసులు సమర్థంగా ఎదుర్కొన్నారని డీజీపీ గుర్తు చేశారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, వ్యవస్థీకృత నేరాలు, రోడ్డు భద్రత, ఇతర కొత్త తరహా సవాళ్లు పోలీసుల ముందున్నాయని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పోలీసు శాఖలో సంస్థాగత మార్పులు చేపట్టామని చెప్పారు. గ్రేహౌండ్స్ తదితర విభాగాల పునర్వ్యవస్థీకరణతోపాటు ఈగల్ ఫోర్స్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో, టీజీ ఫాస్ట్, టీజీ స్పార్క్ వంటి విభాగాలను బలోపేతం చేసి కొత్త సవాళ్లను ఎదుర్కొనేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులు కూడా ఈ మార్పులకు అనుగుణంగా సిద్ధంగా ఉండాలని సూచించారు.

**ఫిట్‌నెస్, స్మార్ట్‌నెస్ తప్పనిసరి**

పోలీసు శాఖలో శారీరక దారుఢ్యం, చురుకుదనం, వృత్తిపరమైన నైపుణ్యాలు అత్యంత ముఖ్యమని డీజీపీ అన్నారు. యూనిఫాం ధరించిన తొలిరోజు ఉన్న ఉత్సాహం, క్రమశిక్షణ, ఫిట్‌నెస్ 30 ఏళ్ల తర్వాత కూడా కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన సేవలందిస్తూ, సమర్థవంతమైన నాయకులుగా ఎదగాలని డీఎస్పీలకు పిలుపునిచ్చారు.



**112 సంఖ్యకు ప్రత్యేక అనుబంధం : అకాడమీ డైరెక్టర్**

పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ 112 సంఖ్యకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. ప్రజల అత్యవసర సేవల కోసం తెలంగాణ పోలీసు వ్యవస్థలో 112 సేవలు అందుబాటులో ఉన్నాయని, ఇప్పుడు 112 మంది డీఎస్పీలు ప్రజా సేవలోకి అడుగుపెట్టడం విశేషమని పేర్కొన్నారు. వీరిలో 74 మంది పురుషులు, 38 మంది మహిళలు ఉన్నారు. మల్టీ జోన్1 నుంచి 51మంది, మల్టీ జోన్2 నుంచి 61 మంది ఎంపికయ్యారు. విద్యార్హతలపరంగా 79మంది డిగ్రీ పట్టభద్రులు, 31మంది పీజీ పూర్తి చేసిన వారు ఉన్నారు. మరో ఇద్దరిలో ఒకరు ఎంబీబీఎస్, మరొకరు బీడీఎస్ పట్టా పొందారు. ఈ బ్యాచ్‌లో గతంలో రాష్ట్ర ప్రభుత్వంలో పనిచేసిన వారు 45మంది, కేంద్ర ప్రభుత్వంలో పనిచేసిన వారు 12మంది ఉండగా కొత్తగా ఉద్యోగ జీవితంలోకి అడుగుపెడుతున్న వారు 55మంది ఉన్నారు. గతంలో పోలీసు శాఖలో ఎస్సైలుగా పనిచేసిన నలుగురు ప్రస్తుతం డీఎస్పీలుగా ఎంపికయ్యారు. శిక్షణ పొందుతూనే 2026లో యూపీఎస్సీ పరీక్షల్లో జి.సృజన 55వ ర్యాంకు, డి.ప్రవీణ్‌కుమార్ 795వ ర్యాంకు సాధించడం విశేషం. ఆరు వారాల ఫౌండేషన్ శిక్షణను డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో అందించినట్లు చెప్పారు. క్షేత్రస్థాయి అనుభవం కల్పించేందుకు మేడారం జాతర, వినాయక చవితి, ఇతర ప్రధాన కార్యక్రమాల్లో విధులు నిర్వర్తించే అవకాశం కల్పించామన్నారు. సైబర్ సెక్యూరిటీ బ్యూరో, ఈగల్ వంటి విభాగాలతో శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. పోలీసుల విధి ప్రజలకు న్యాయం చేయడమేనని, వారి పనితీరును బట్టే ప్రజలు వారిని అంచనా వేస్తారని అన్నారు.

**నేహా అగర్వాల్‌కు సీఎం రివాల్వర్.. 9 విభాగాల్లో ఉత్తమ ప్రతిభకు ట్రోఫీలు, పతకాలు**

శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నేహా అగర్వాల్ ముఖ్యమంత్రి రివాల్వర్‌తోపాటు మరో మూడు పురస్కారాలను అందుకున్నారు. బెస్ట్ ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌కు సీఎం రివాల్వర్, రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకం, కోన రామచంద్రారెడ్డి స్మారక బంగారు పతకం, ఇండోర్ సబ్జెక్టుల్లో ప్రతిభకు హోంమంత్రి బేటన్ ఆమెకు లభించాయి. రాజా బహదూర్ వెంకట రామారెడ్డి బంగారు పతకంతోపాటు రూ.5,000 నగదు బహుమతి కూడా అందుకున్నారు. ఇతర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారిలో ఔట్‌డోర్ సబ్జెక్టుల్లో ఎల్.శ్రీకాంత్ డీజీపీ ట్రోఫీ, ఫైరింగ్‌లో టి. జాకబ్ అభిషేక్ ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఫోరెన్సిక్ సైన్స్‌లో డి. చందన, క్రిమినాలజీలో ఆదిశేషురెడ్డి ఎనఐసీఎఫఎస్ పతకాలు సాధించారు. దర్యాప్తులో ఉత్తమ ప్రతిభకు ఆర్.సాయి కిరణ్ రెడ్డి డైరెక్టర్ పతకాన్ని దక్కించుకున్నారు. పాసింగ్ అవుట్ పరేడ్‌లో సీనియర్ పోలీసు అధికారులు, రిటైర్డ్ పోలీసు అధికారులు, అకాడమీ సిబ్బంది, శిక్షణ పొందిన డీఎస్పీల కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రూ.20 లక్షల లంచం తీసుకుంటూ సర్వేయర్ అరెస్ట్

**రంగారెడ్డి, అక్టోబర్ 12:**

భూ సర్వే నివేదిక జారీ చేసేందుకు రూ.20 లక్షలు లంచం తీసుకుంటుండగా మండల సర్వేయర్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ వ్యవహారంలో అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ ప్రమేయం ఉన్నట్లు గుర్తించి ఆయనను కూడా అరెస్ట్ చేశారు. హెచ్‌ఎండీఏ నిబంధనల ప్రకారం భూమిని సర్వే చేసి, జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నివేదిక ఇచ్చేందుకు అధికారులు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది.

**తొలుత రూ.30 లక్షలు డిమాండ్**

ఏసీబీ ప్రెస్‌నోట్ ప్రకారం.. నివేదిక జారీ చేసేందుకు నిందితులు మొదట రూ.30 లక్షలు డిమాండ్ చేశారు. అనంతరం బేరసారాల ద్వారా రూ.20 లక్షలకు అంగీకరించారు. తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల సర్వేయర్ బటుక శ్రీనివాసులు ఫిర్యాదుదారుడి నుంచి నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సర్వేయర్ చేతి వేళ్లకు నిర్వహించిన రసాయన పరీక్షల్లో సానుకూల ఫలితాలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**ప్రత్యేక కోర్టులో హాజరు**

ఈ కేసులో సర్వేయర్ బటుక శ్రీనివాసులు, తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డిని అరెస్ట్ చేసినట్లు ఏసీబీ వెల్లడించింది. ఇద్దరినీ హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు తెలిపింది. ఫిర్యాదుదారుడి వివరాలను గోప్యంగా ఉంచామని, కేసుపై తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొంది. ప్రభుత్వ విధుల్లో అవినీతికి పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది.

# అంతర్జాతీయ శాసనసభల మధ్య సహకారం అవశ్యం

**హైదరాబాద్, అక్టోబర్ 12 :**

ప్రజాస్వామ్య వ్యవస్థల బలోపేతానికి అంతర్జాతీయ శాసనసభల మధ్య పరస్పర సహకారం అవసరం అని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌లు అన్నారు. జపాన్ హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ, ప్రభుత్వ ప్రతినిధుల బృందం తెలంగాణ అసెంబ్లీని సోమవారం సందర్శించింది. ఈ సందర్భంగా అసెంబ్లీలో జపాన్ దేశానికి చెందిన హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ, ప్రిఫెక్చరల్ ప్రభుత్వ ప్రతినిధుల బృందంతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అంతకు ముందు జపాన్ ప్రతినిధుల బృందానికి శాసనసభ తరఫున ఘన స్వాగతం పలికారు. భారత్, జపాన్‌ల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు పరస్పర విశ్వాసం, గౌరవం, సహకారానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయని సుఖేందర్ రెడ్డి అన్నారు. జపాన్ దేశం సాంకేతిక పరిజ్ఞానం, పారిశ్రామిక అభివృద్ధి, క్రమశిక్షణ, పరిశోధనలు, ఆవిష్కరణల రంగాల్లో ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. రాష్ట్రం కూడా సమాచార సాంకేతికత, ఫార్మా, వ్యవసాయం, విద్య, వైద్య రంగాలతోపాటు మౌలిక సదుపాయాల అభివృద్ధిలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. రాష్ట్రం, జపాన్‌లోని హిరోషిమా ప్రాంతం మధ్య పారిశ్రామిక, సాంకేతిక, విద్యా, సాంస్కృతిక రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. హిరోషిమా నగరం ప్రపంచ చరిత్రలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందని, రెండో ప్రపంచ యుద్ధంలో తీవ్ర విధ్వంసాన్ని ఎదుర్కొన్నప్పటికీ శాంతి, పునర్నిర్మాణం, అభివృద్ధికి ప్రపంచవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచిందని అన్నారు. హిరోషిమా ప్రజల ఆత్మవిశ్వాసం, పట్టుదల, శాంతి సందేశం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రపంచంలో శాంతి, సామరస్యం, సుస్థిర అభివృద్ధి సాధించేందుకు దేశాల మధ్య పరస్పర సహకారం అత్యంత అవసరమని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో శాసనసభల పాత్ర ఎంతో కీలకమని, వివిధ దేశాల శాసనసభల మధ్య జరిగే ఇలాంటి సమావేశాలు శాసన ప్రక్రియలు, పరిపాలనా విధానాలు, ప్రజాస్వామ్య విలువలపై పరస్పర అవగాహన పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరానికి జపాన్‌లోని మియోషి నగరంతో ఉన్న సోదర నగర సంబంధాలు ఇరు ప్రాంతాల మధ్య సాంస్కృతిక, సామాజిక అనుబంధానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో జపాన్ పెట్టుబడులు మరింత పెరగాలని, ముఖ్యంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి సంస్థలు ఏర్పాటు చేసేందుకు పరస్పర సహకారం అవసరమని అభిప్రాయపడ్డారు. జపాన్ ప్రతినిధుల బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ ఈ పర్యటన భారత్‌జపాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని సుఖేందర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

భారత్, జపాన్ దేశాల మధ్య చారిత్రక స్నేహ సంబంధాలు ఉన్నాయని, రెండు దేశాలు ప్రజాస్వామ్య విలువలు, శాంతి, అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. శాసనసభను జపాన్ హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ, ప్రభుత్వ ప్రతినిధులు సందర్శించడం ఎంతో సంతోషకరమని అన్నారు. తెలంగాణ, హిరోషిమా ప్రాంతాల మధ్య సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలు, విద్య, పరిశోధనలు, ఆవిష్కరణల రంగాల్లో పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నగరం అంతర్జాతీయ స్థాయిలో ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, పరిశోధన, పారిశ్రామిక రంగాలకు ప్రధాన కేంద్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. జపాన్‌కు చెందిన పారిశ్రామిక సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని, తద్వారా రెండు ప్రాంతాల మధ్య ఆర్థిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని చెప్పారు. ముఖ్యంగా ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, గ్రీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాల్లో జపాన్ సాంకేతిక పరిజ్ఞానం, తెలంగాణలోని మానవ వనరులను సమన్వయం చేసుకోవడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య దేశాల్లో శాసనసభలు ప్రజల ఆకాంక్షలకు ప్రతిబింబాలుగా నిలుస్తాయని, ప్రజల సమస్యల పరిష్కారం, పారదర్శక పాలన, జవాబుదారీతనం పెంపొందించడంలో శాసనసభల పాత్ర అత్యంత ముఖ్యమైనదని వివరించారు. తెలంగాణ శాసనసభ, హిరోషిమా ప్రిఫెక్చరల్ అసెంబ్లీ మధ్య శాసన విధానాలు, సభా నిర్వహణ, శాసనసభ కమిటీల పనితీరు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం వంటి అంశాలపై పరస్పర అనుభవాలను పంచుకోవడం ప్రయోజనకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. రెండు ప్రాంతాల శాసనసభల మధ్య ప్రతినిధుల పర్యటనలు, అధ్యయన కార్యక్రమాలు, పరస్పర చర్చలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. తెలంగాణ, జపాన్ మధ్య విద్యార్థులు, పరిశోధకులు, పారిశ్రామికవేత్తలు, సాంకేతిక నిపుణుల పరస్పర మార్పిడి కార్యక్రమాలు పెరగాలని ఆకాంక్షించారు. ఈ సమావేశం అధికారిక పర్యటనగా మాత్రమే కాక తెలంగాణజపాన్ ప్రాంతాల మధ్య భవిష్యత్తు సహకారానికి బలమైన వేదికగా నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజల తరఫున జపాన్ ప్రతినిధులకు హృదయపూర్వక స్వాగతం తెలియజేస్తూ, ఇరు ప్రాంతాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలోపేతం కావాలని గడ్డం ప్రసాద్ కుమార్ గారు ఆకాంక్షించారు. సమావేశంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, శాసనమండలి సెక్రటరీ డాక్టర్ నరసింహాచార్యులు, శాసనసభ సెక్రటరీ రెండ్ల తిరుపతి, జపాన్ ప్రతినిధుల బృందం సభ్యులు, శాసనసభ, శాసనమండలి ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్65 విస్తరణను వేగవంతం చేయాలి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 12 :**

హైదరాబాద్‌విజయవాడ మచిలీపట్నం జాతీయ రహదారి65 (ఎన్‌హెచ్65) విస్తరణ పనులను వేగవంతం చేసి వీలైనంత త్వరగా ప్రారంభించాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్‌ను కోరారు. ఈ మేరకు దిల్లీలో ఆయనతోపాటు సభ్యులు (ప్రాజెక్టులు) విప్నేష్ శర్మతో మంత్రి సమావేశమై ఈ కీలక ప్రాజెక్టుపై చర్చించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు అత్యంత కీలకమైన ఈ జాతీయ రహదారిపై రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీ, తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ రహదారి విస్తరణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని అధికారులను కోరారు.

**నాలుగు లేన్ల నుంచి ఆరు లేన్లు +2సర్వీస్ రోడ్లు విస్తరణ**

ప్రతిపాదిత ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నాలుగు లేన్ల రహదారిని ఆరు లేన్లుగా విస్తరించడంతోపాటు ఇరువైపులా సర్వీస్ రోడ్లు, నియంత్రిత ప్రవేశ సౌకర్యాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఈ విస్తరణ పూర్తయితే వాహనాల రాకపోకలు సులభతరమవడంతోపాటు ట్రాఫిక్ రద్దీ తగ్గి, ప్రయాణ సమయం ఆదా అవుతుందని మంత్రి పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రమాదాల నివారణకు, రహదారి భద్రతను మెరుగుపరచడానికి ఈ ప్రాజెక్టు ఎంతో దోహదపడుతుందని వివరించారు.

**2027 జనవరి నాటికి పనులు ప్రారంభిస్తాం: ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్**

మంత్రి విజ్ఞప్తిపై స్పందించిన ఎన్‌హెచ్‌ఏఐ చైర్మన్ సంతోష్‌కుమార్ యాదవ్ ఈ ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ల దాఖలుకు 2026 నవంబర్ 11 చివరి తేదీగా నిర్ణయించినట్లు తెలిపారు. 2027 జనవరి నాటికి పనులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు.

**ప్రజల ప్రాణాల భద్రతే ప్రాధాన్యం**

హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి వేలాదిమంది ప్రయాణికులు, వాహనదారులకు నిత్యం కీలక రవాణా మార్గంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా విస్తరణ పనులను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టాలని స్పష్టం చేశారు. రహదారుల అభివృద్ధి అంటే కేవలం ప్రయాణ సౌకర్యాలను పెంచడమే కాకుండా, ప్రజల ప్రాణాలను కాపాడటం, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమివ్వడం, తెలుగు రాష్ట్రాల మధ్య రవాణా అనుసంధానాన్ని బలోపేతం చేయడం కూడా అని మంత్రి పేర్కొన్నారు. ఎన్‌హెచ్65 విస్తరణ పనులు సకాలంలో పూర్తయ్యేలా కేంద్ర సంస్థలతో నిరంతరం సమన్వయం చేసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.



## జంతర్ మంతర్‌లో ధర్నాలు, నిరసనలపై నిషేధం

- ట్రాఫిక్ ఇబ్బందులు, భద్రతా కారణాలతో ఢిల్లీ పోలీసుల నిర్ణయం
- ల్యూటియన్స్ ఢిల్లీలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని వెల్లడి
- నిరసనలకు ప్రత్యామ్నాయంగా మూడు వేదికల కేటాయింపు
- రాంలీలా మైదాన్, బురాడీ మైదాన్, సీబీడీ గ్రౌండ్స్‌లో అనుమతితో ఆందోళనలు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 12:**

దేశ రాజధానిలో నిరసనలు, ధర్నాలకు ప్రధాన వేదికగా ఉన్న జంతర్ మంతర్‌లో ఆందోళనల నిర్వహణపై ఢిల్లీ పోలీసులు నిషేధం విధించినట్లు సమాచారం. ట్రాఫిక్ సమస్యలు, భద్రతాపరమైన ఇబ్బందులు, స్థానికులకు కలుగుతున్న అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

**ప్రత్యామ్నాయంగా మూడు ప్రాంతాలు**

జంతర్ మంతర్ వద్ద వివిధ సంఘాలు, రాజకీయ పార్టీలు తరచూ నిర్వహిస్తున్న నిరసనల కారణంగా ల్యూటియన్స్ ఢిల్లీలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోందని పోలీసులు తెలిపారు. అయితే, ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కుకు అవకాశం కల్పిస్తూ ప్రత్యామ్నాయంగా మూడు ప్రాంతాలను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఇకపై రాంలీలా మైదాన్, బురాడీ మైదాన్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్స్‌లో ముందస్తు అనుమతి తీసుకుని నిరసనలు నిర్వహించుకోవచ్చని ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు సమాచారం.



## ఫారం-6పై తీర్పు ఇవ్వలేదు.. ఈసీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

- బిహార్ ఎస్ఐఆర్‌లో కొత్త ఫారం-6కు ఆమోదం తెలపలేదని స్పష్టీకరణ
- కోర్టు తీర్పును తప్పుగా ప్రస్తావించడంపై సీజేఐ అసహనం
- దరఖాస్తుల్లో మార్పులు ఎవరు చేశారో రికార్డులు పరిశీలిస్తామని వెల్లడి
- సెప్టెంబర్ 26న ఈసీ విడుదల చేసిన ప్రకటనపై మరోసారి స్పష్టత

**న్యూఢిల్లీ, అక్టోబర్ 12:**

బిహార్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో కొత్త ఫారం 6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందన్న ఎన్నికల సంఘం ప్రకటనపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆ ఫారంపై తాము ఎలాంటి తీర్పు ఇవ్వలేదని స్పష్టం చేసింది. దరఖాస్తుల్లో మార్పులు ఎవరు చేశారన్నది రికార్డులను పరిశీలించి తేలుస్తామని ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) వ్యాఖ్యానించారు.

**తీర్పులో ప్రస్తావనే లేదు**

బిహార్ ఎస్ఐఆర్ కేసు విచారణ సందర్భంగా సవరించిన ఫారం6కు సుప్రీంకోర్టు ఆమోదం తెలిపిందని ఎన్నికల సంఘం పేర్కొన్న విషయాన్ని పిటిషనర్ తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. ఎస్ఐఆర్‌పై విచారణ సమయంలో కొత్త ఫారం 6 అంశం తమ ముందుకు రాలేదని, దానిపై ఎలాంటి తీర్పు ఇవ్వలేదని తేల్చిచెప్పింది.

**మరోసారి స్పష్టీకరణ**

2026 మేలో వెలువడిన బిహార్ ఎస్ఐఆర్ తీర్పులో కొత్త ఫారం 6ను సమర్థించినట్లు ఎన్నికల సంఘం సెప్టెంబర్ 26న పత్రికా ప్రకటన విడుదల చేసింది. అయితే, అక్టోబర్ 5న ఇతర పిటిషన్ల విచారణ సందర్భంగా ఈ వాదనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఫారంలో చేసిన మార్పులకు తాము ఆమోదం తెలపలేదని స్పష్టం చేసింది. తాజాగా సోమవారం మరోసారి ఇదే విషయాన్ని పునరుద్ఘాటించడంతో ఎన్నికల సంఘం ప్రకటనపై చర్చ మొదలైంది.

## సుప్రీంకోర్టు తలుపులు అందరికీ తెరిచే ఉంటాయి: సీజేఐ

- విపక్ష నేతలకు అపాయింట్‌మెంట్ నిరాకరణపై సూర్యకాంత్ వివరణ
- శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందని లేఖలో పేర్కొన్న వైనం
- సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు ఇండియా కూటమి పాదయాత్ర

**న్యూఢిల్లీ, అక్టోబర్ 12:**

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను కలిసేందుకు ఇండియా కూటమి నేతలు చేసిన ప్రయత్నం ఫలించలేదు. అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడానికి గల కారణాలను సీజేఐ వివరించారు. ఆదివారమే ఈ విషయంపై విపక్ష నేతలకు లేఖ రాశానని, వారిని కలిస్తే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉన్నందునే సమావేశానికి అంగీకరించలేదని తెలిపారు. అయితే సుప్రీంకోర్టు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని, ఎవరైనా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని స్పష్టం చేశారు.

**నేడు సుప్రీంకోర్టుకు పాదయాత్ర**

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విపక్ష పార్టీలు కొద్దిరోజులుగా ఢిల్లీలో నిరసనలు చేపడుతున్నాయి. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం 1.30 గంటలకు సుప్రీంకోర్టు వరకు పాదయాత్ర నిర్వహించాలని ఇండియా కూటమి నేతలు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌తోపాటు ఇతర విపక్ష పార్టీల నాయకులు పాల్గొననున్నారు. పాదయాత్ర నేపథ్యంలో పోలీసులు భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు.

# సుప్రీంకోర్టు వైపు ప్రతిపక్షాల మహా ప్రదర్శన

- రాహుల్, ప్రియాంక నేతృత్వంలో భారీ ర్యాలీని అడ్డుకున్న దిల్లీ పోలీసులు
- అంచనాలకు మించి పాల్గొన్న నిరసనకారులు
- ఎన్నికల సంఘంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు
- 11 మంది ఇండియా కూటమి నేతల సంతకాలు
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, ఎస్ఐ ఐఆర్ నిలిపివేతకు డిమాండ్
- రాహుల్ వెంట విద్యార్థి నాయకురాలు నేహా బోరా
- భగవాన్ దాస్ రోడ్డులో పోలీసు బారికేడ్లు
- జంతర్ మంతర్ లో నిరసనలకు అనుమతులు రద్దు



**దిల్లీ,**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా, వోటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ నిలిపివేత డిమాండ్ తో ప్రతిపక్ష ఇండియా కూటమి సోమవారం దిల్లీలో భారీ ప్రదర్శన నిర్వహించింది. లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ, సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ తదితరులు ప్రదర్శనలో పాల్గొన్నారు. కన్నాట్ ప్లేస్ నుంచి సుప్రీంకోర్టు వైపు బయలుదేరిన నిరసనకారులను పోలీసులు భగవాన్ దాస్ రోడ్డులో బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకున్నారు. రాహుల్ గాంధీ నేతృత్వంలోని ప్రదర్శనను నిలువరించినప్పటికీ, ప్రతిపక్షాల న్యాయవాదుల బృందం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో కొన్ని రోజులుగా వీధుల్లో సాగుతున్న ఉద్యమం సోమవారం న్యాయస్థానానికి కూడా చేరింది.

**రాహుల్ తో కలిసి నేహా బోరా ప్రదర్శన**

కన్నాట్ ప్లేస్‌బారాఖంబా రోడ్డు పరిసరాల్లో పెద్ద సంఖ్యలో ప్రతిపక్ష మొదటిపేజీ తరువాయి... కార్యకర్తలు, విద్యార్థులు, పౌరసమాజ ప్రతినిధులు సమావేశమయ్యారు. అనంతరం సుప్రీంకోర్టు వైపు ప్రదర్శన సాగింది. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో కలిసి ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) నాయకురాలు నేహా బోరా నడవడం ప్రత్యేకం గా కనిపించింది. అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, ఎం.ఏ. బేబీ, సుప్రియా సూలే, యో గేంద్ర యాదవ్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. పలువురు నేతలు ప్రత్యేక వాహనాల్లో ప్రయాణించగా, కార్యకర్తలు అంచనాలకు మిం చి రహదారులపై ప్రదర్శన కొనసాగించారు.

**సాయంత్రం సుప్రీంకోర్టులో పిటిషన్**

సాయంత్రం 4:35 గంటల ప్రాంతంలో రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది ఎస్. ప్రసన్న సుప్రీంకోర్టులో పిటిషన్ సమర్పించి నట్లు తెలుస్తుంది ఈ పిటిషన్పై 11 మంది ఇండియా కూటమి నాయకుల పేర్లు ఉన్నాయి. వారిలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సౌగత రాయ్, అఖిలేశ్ యాదవ్, తేజస్వీ యాదవ్, సంజయ్ రౌత్, ఎం.ఏ. బేబీ, డి. రాజా, మహువా మొయిత్రా సుప్రియా సూలే, ఈటీ మహమ్మద్ బషీర్ ఉన్నారు. పిటిషన్లో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పాటు ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలను కూడా ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఎస్ఆర్ ప్రక్రియలో అవకతవ కలు జరిగాయన్న ఆరోపణలను, ఎన్నికల సంఘం నిర్ణయాల చట్టబద్ధతను పిటిషనర్లు ప్రశ్నిస్తున్నారు.కేసు వివరాలు: రాహుల్ గాంధీ తదితరులు వర్సెస్ భారత ఎన్నికల సంఘం డైరీ నంబర్ 64196/2026. పిటిషన్ దాఖలైనప్పటికీ, అందులోని ఆరోపణలపై సుప్రీంకోర్టు ఇంకా తీర్పు ఇవ్వలేదు.

**సుప్రీం కోర్టుకు చేరువలోనే నిలిపివేత**

సాయంత్రం 6:10 గంటల ప్రాంతంలో భగవాన్ దాస్ రోడ్డులో నిరసనకారులను పోలీసులు చెదరగొట్టడం ప్రారంభించారు. సుప్రీం కోర్టుకు దాదాపు 200 మీటర్ల దూరంలో ప్రదర్శనను అడ్డుకున్నారు బారికేడ్ల వద్ద పోలీసులు విజిల్స్ మోగిస్తూ నిరసనకారులను వెనక్కి పంపేందుకు ప్రయత్నించారు. అంతకుముందు బారాఖంబా రోడ్డులో కొందరు కార్యకర్తలు బారికేడ్లను ఎక్కడంతో ఉద్రిక్తత ఏర్పడింది.

**ఎన్నికల కమిషనర్ కు రాహుల్ హెచ్చరిక**

ప్రదర్శనకు ముందు కాంగ్రెస్ ప్రధాన కార్యలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ జ్ఞానేశ్ కుమార్ పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని, వాటికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసి, తనకు తెలిసిన విషయాలను వెల్లడించాలని కోరారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించడంలేదన్నది రాహుల్ గాంధీ ప్రధాన ఆరోపణ. కాగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ను ప్రత్యక్షంగా కలవాలని ప్రతిపక్షాలు కోరగా ఆయన అంగీకరించలేదు. ఎన్నికల జాబితాలకు సంబంధించిన అంశాలు ఇప్పటికే న్యాయస్థానంలో విచారణలో ఉన్నందున వాటిపై బయట సమావేశం నిర్వహించడం న్యాయపరమైన సంప్రదాయాలకు విరుద్ధమవుతుందని వివరించారు. న్యాయపరమైన మార్గం లో పిటిషన్ దాఖలు చేయవచ్చని సూచించారు. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాల న్యాయవాదులు సోమవారం పిటిషన్ సమర్పించారు. సుప్రీం కోర్టు ఈ పిటిషన్ను మంగళవారం విచారణకు తీసుకునే అవకాశం ఉందని ప్రత్యక్ష కథనాలు పేర్కొన్నాయి.

**జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అనుమతి రద్దు**

సోమవారం మరో కీలక నిర్ణయంగా దిల్లీ పోలీసులు జంతర్ మంతర్ ను నిరసనల కోసం గుర్తించిన అధికారిక ప్రదేశాల జాబితా నుంచి తొలగించారు. ప్రత్యామ్నాయంగా రామ్లీలా మైదాన్, బురారీ గ్రౌండ్, తూర్పు ఢిల్లీలోని సీబీడీ గ్రౌండ్ ను నిరసనల కోసం గుర్తించారు. ఈ నిర్ణయాన్ని సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విమర్శించారు. శాంతియుత నిరసనల హక్కుపై అనవసర పరిమితులు విధిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ నాయకులు ఢిల్లీ పోలీసులను కలిసి జంతర్ మంతర్ వద్ద నిరసనకు తేదీ, సమయం నిర్ణయించాలనీ కోరారు. 24 గంటల్లో స్పందించాలని డిమాండ్ చేశారు. కొత్త కార్యక్రమానికి అనుమతి ఇచ్చినట్లు సాయంత్రం వరకు ధ్రువీకరణ లేదు.

**ఆరు మెట్రో స్టేషన్ల మూసివేత**

ప్రదర్శన సందర్భంగా దిల్లీలో ఆరు మెట్రో స్టేషన్ల ప్రవేశ, నిష్క్రమణలపై పది గంటలపాటు ఆంక్షలు విధించారు. కేంద్ర ఢిల్లీలో 20కిపైగా రహదారుల్లో ట్రాఫిక్ నియంత్రణలు చేపట్టారు. కీలక ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి, జల ఫిరంగులను సిద్ధంగా ఉంచారు.

**తదుపరి సుప్రీంకోర్టు విచారణ**

సోమవారం జరిగిన ప్రదర్శనతో ఎన్నికల సంఘంపై ప్రతిపక్షాల ఉద్యమం కొత్త దశకు చేరింది. జంతర్ మంతర్ నిరసనల నేపథ్యంలో ప్రారంభమైన పోలీసు చర్యలు, ఎన్నికల సంఘం పనితీరుపై రాజకీయ వివాదం ఇప్పుడు సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్తో న్యాయప రమైన పరిశీలనకు కూడా వొచ్చింది.మంగళ వారం పిటిషన్ విచారణకు వొస్తుందా, ఎస్ఐఆర్పై మధ్యంతర ఆదేశాలు వెలువడ తాయా, ఎన్నికల సంఘం తరఫున ఏ వివరణ సమర్పిస్తారన్నవి తదుపరి ముఖ్యాంశాలుగా ఉన్నాయి. ఈ సాయంత్రం ప్రధాన పరిణామం: ఇండియా కూటమి ప్రదర్శనను పోలీసులు సుప్రీంకోర్టు సమీపంలో అడ్డుకున్నప్పటికీ 11మంది ప్రతిపక్ష నాయకుల తరపున ఎన్నికల సంఘంపై పిటిషన్ దాఖలైంది.




## పీఎం ధన్‌ధాన్య కృషి యోజనలో జాతీయ గుర్తింపు

- అవార్డు అందుకున్న నారాయణపేట కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట, అక్టోబర్ 12 :**

నారాయణపేట జిల్లాలో ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన కార్యక్రమం అమలులో విశిష్ట సేవలు అందించినందుకు జిల్లా కలెక్టర్ ప్రియాంక న్యూదిల్లీలో వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల సంక్షేమం, ప్రభుత్వ పథకాల సమర్థవంతమైన అమలులో జిల్లా యంత్రాంగం చేసిన కృషికి ఈ గుర్తింపు లభించడం విశేషం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన లక్ష్యాలకు అనుగుణంగా వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందించడం, వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం వంటి అంశాల్లో అధికారులు అంకితభావంతో పనిచేయడం అభినందనీయమని అన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేస్తూ, సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ అవార్డు సాధనలో భాగస్వాములైన జిల్లా అధికారులందరికీ, వారి బృందాలకు జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరి సహకారం, కృషి, బాధ్యతాయుతమైన పనితీరు ఈ విజయానికి పునాది అని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ ఇదే బృంద స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు జిల్లా అభివృద్ధిలో మరిన్ని మైలురాళ్లను సాధించాలని ఆకాంక్షించారు. నారాయణపేట జిల్లాకు లభించిన ఈ గుర్తింపు జిల్లా యంత్రాంగానికి మరింత బాధ్యతను పెంచిందని, రానున్న రోజుల్లో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ఈ అవార్డు ప్రేరణగా నిలుస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## రిటైల్ ద్రవ్యోల్బణం 5.54 శాతానికి పెరుగుదల

- ఆహార ధరల పెరుగుదలతో సెప్టెంబర్‌లో పైకి
- ఆగస్టులో 4.83 శాతం.. నెలలోనే గణనీయమైన మార్పు
- పట్టణాల కంటే గ్రామీణ ప్రాంతాల్లో అధిక ద్రవ్యోల్బణం
- సామాన్య కుటుంబాల నెలవారీ ఖర్చులపై ప్రభావం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 12:**

దేశంలో రిటైల్ ద్రవ్యోల్బణం మరోసారి పెరిగింది. ఆహార పదార్థాల ధరలు పెరగడంతో సెప్టెంబర్‌లో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 5.54 శాతానికి చేరింది. ఆగస్టులో ఇది 4.83 శాతంగా నమోదైంది. కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ పరిధిలోని జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి.

**గ్రామీణ ప్రాంతాల్లో అధికం**

సెప్టెంబర్‌లో గ్రామీణ ప్రాంతాల్లో రిటైల్ ద్రవ్యోల్బణం 6.08 శాతంగా నమోదవగా, పట్టణ ప్రాంతాల్లో 4.88 శాతంగా ఉంది. పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ధరల పెరుగుదల ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. జనవరిలో ప్రవేశపెట్టిన కొత్త సూచీ సిరీస్‌లో సెప్టెంబర్ ద్రవ్యోల్బణం అత్యధిక స్థాయికి చేరినట్లు నివేదిక వెల్లడించింది.

**ఆహార ధరలే ప్రధాన కారణం**

నిత్యావసర ఆహార పదార్థాల ధరల పెరుగుదల మొత్తం ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపింది. దీంతో కుటుంబాల నెలవారీ బడ్జెట్‌పై అదనపు భారం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నమోదైన అధిక ద్రవ్యోల్బణం సామాన్యుల జీవన వ్యయంపై ధరల పెరుగుదల ప్రభావాన్ని స్పష్టం చేస్తోంది.



## ఎల్‌ఓసీ వద్ద చొరబాటు యత్నం.. మందుపాతర పేలుడులో నలుగురు మృతి?

- పూంఛ్ ప్రాంతంలో ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం
- తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో చొరబాటు యత్నం
- భారత సైన్యం చొరబాటు నిరోధక భద్రతా వ్యవస్థ పరిధిలో పేలుడు
- ఘటన వివరాలపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది

**జమ్మూ, అక్టోబర్ 12:**

జమ్మూ కశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ) వెంబడి చొరబాటు యత్నం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో మందుపాతర పేలడంతో నలుగురు ఉగ్రవాదులు మరణించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. అయితే, ఈ ఘటనకు సంబంధించిన వివరాలను అధికారిక వర్గాలు ధ్రువీకరించాల్సి ఉంది.

**తెల్లవారుజామున ఘటన?**

అందిన సమాచారం ప్రకారం.. సోమవారం తెల్లవారుజామున సుమారు 4.30 గంటలకు పాకిస్థాన్ వైపు నుంచి కొందరు వ్యక్తులు నియంత్రణ రేఖ దాటి భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో భారత సైన్యం ఏర్పాటు చేసిన చొరబాటు నిరోధక భద్రతా వ్యవస్థ పరిధిలోకి వారు వచ్చినట్లు ప్రాథమిక నివేదికలు సూచిస్తున్నాయి. అక్కడ మందుపాతర పేలడంతో నలుగురు మరణించినట్లు సమాచారం.



**హాజీరా సెక్టార్‌లో ఘటన?**

ఈ ఘటన పాకిస్థాన్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్‌లోని హాజీరా సెక్టార్ పరిధిలో ఉన్న బదర్‌పూర్ ప్రాంతంలో జరిగినట్లు కొన్ని నివేదికలు పేర్కొంటున్నాయి. ఆ ప్రాంతంలో పాకిస్థాన్ సైన్యానికి చెందిన 66 ఫ్రంటియర్ ఫోర్స్ మోహరించి ఉన్నట్లు కూడా సమాచారం వెలువడింది. అయితే, ఘటన జరిగిన ప్రదేశం, మృతుల వివరాలు, చొరబాటు యత్నానికి సంబంధించిన అంశాలపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# శంకర్ పల్లి పిఏసీఎస్ చెర్మన్ గా బొల్లారం వెంకట్ రెడ్డి

- వైస్ చైర్మన్ గా పార్శి బాలకృష్ణ భాధ్యతలు...
- 13 మంది డైరెక్టర్లతో నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం..





**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** శంకర్ పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పి.ఏ.సి.ఎస్) నూతన చైర్మన్ గా బొల్లారం వెంకట్ రెడ్డి సోమవారం ఘనంగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో ఎం.ఎస్. నం. 68 ప్రకారం ఆయన నియామకం జరిగింది. శంకర్ పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో జరిగిన ఈ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి సహకార శాఖ అధికారులు, రైతులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శంకర్ పల్లి మండలంలో సీనియర్ రైతు నాయకుడిగా, అన్ని వర్గాల ప్రజలతో సన్నిహిత సంబంధాలు ఉన్న నాయకుడిగా బొల్లారం వెంకట్ రెడ్డికి మంచి పేరు ఉంది. రైతుల సమస్యలపై ఆయనకు ఉన్న అవగాహనతోనే ప్రభుత్వం ఆయనను ఈ కీలక బాధ్యతలకు ఎంపిక చేసింది.

**13 మంది డైరెక్టర్లతో బలమైన కమిటీ...**

ఈ కమిటీలో మొత్తం 13 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు చెందిన నాయకులకు ప్రాతినిధ్యం కల్పించారు.1. పార్శి బాలకృష్ణ (వైస్ చైర్మన్) 2. కర్కనగారి మాణిక్య రెడ్డి 3. మామిడిపల్లి జనార్ధన్ రెడ్డి, 4. బుచ్చనోళ్ల ఇంద్రమ్మ 5. కొలన్ శ్రీనివాస్ రెడ్డి 6. గుండ్ర లచ్చి రెడ్డి 7. వడ్డె మల్లికార్జున్ 8.గుంతల ప్రశాంత్ రెడ్డి 9. బూరిగల్ల సమయ్య 10.పాత్లోత్ శంకర్ 11.వొగ్గు చంద్రకళ 12. కొంగల శ్రీధర్, చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డితో కలిపి మొత్తం 13 మంది, బాధ్యతలు స్వీకరించారు. స్వీకరణ అనంతరం చైర్మన్ బొల్లారం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ...

**రైతులకు అండగా ఉంటా.. బొల్లారం వెంకట్ రెడ్డి**

పిఏసిఎస్ చైర్మన్గా తన బాధ్యత మరింత పెరిగిందని, రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. "తనపై నమ్మకం ఉంచి పి.ఏ.సి.ఎస్ చైర్మన్ గా నియమించిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి, స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య, స్థానిక నాయకులకు తన కృతజ్ఞతలు తెలిపారు. శంకర్ పల్లి పి.ఏ.సీ.ఎస్ అంటేనే వేలాది మంది రైతుల నమ్మకం. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా నడుచుకుంటానన్నారు . రైతులకు పంట రుణాలు, ఎరువులు, విత్తనాలు సకాలంలో అందేవిధంగా చూస్తానన్నారు. పి.ఏ.సి.ఎస్ ని లాభాల బాటలో నడిపి, రైతులకు అండగా ఉంటానన్నారు. ప్రతి రైతు సమస్యను తన సొంత సమస్యగా భావించి పరిష్కరిస్తా" అని హామీ ఇచ్చారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని శంకర్ పల్లి మండలంలోని వివిధ గ్రామాల రైతులు, నాయకులు శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# కొరట్లగూడెంలో ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశం

**పాల్గొన్న కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు**



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలంలోని కొరట్లగూడెం గ్రామంలో మహమ్మద్ సమీనా-యాసిన్ దంపతుల ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, అందులో ఇందిరమ్మ ఇళ్ల పథకం ఒకటని అన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదల కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ పాలేరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో రాయగూడెం సర్పంచ్ బోయిన వేణు, మహమ్మద్ మొగిలి, దామోదర వెంకన్న, గుండా కోటి, షేక్ అజీద్, షేక్ రాహుల్, షేక్ ఫరీద్, దండాల ఉమేష్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# కేపీహెచ్‌బీలో ఘనంగా సామూహిక కుంకుమార్చన



**కూకట్ పల్లి, రాజముద్ర న్యూస్:** స్థానిక భువన విజయం గ్రౌండ్‌లో ఈ నెల 17న 3,116 మంది మహిళలతో భారీ సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఛత్రపతి ధర్మరక్షణ సేన అధ్యక్షుడు కర్రా వేణుగోపాల్ తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ పూజలో పాల్గొనే మహిళా భక్తులకు అవసరమైన పూజా సామగ్రిని ఉచితంగా అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఘనంగా కాంగ్రెస్ సీనియర్ నేత దేవుల నాయక్ జన్మదిన వేడుకలు




- చేవెళ్ల బి.సి. సంక్షేమ సంఘం నేత బండమీది వెంకటేష్ ఆధ్వర్యంలో ఘన సత్కారం
- శాలువాతో సత్కరించి, భగవద్గీత పుస్తకాన్ని బహూకరించిన బండమీది వెంకటేష్

**శంకర్ పల్లి, రాజముద్ర న్యూస్:** చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, నిఖార్సయిన కాంగ్రెస్ వాది దేవుల నాయక్ జన్మదిన వేడుకలు ఆదివారం మోకిలలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా చేవెళ్ల నియోజకవర్గ బి.సి. సంక్షేమ సంఘం నాయకుడు బండమీది వెంకటేష్ హాజరై, దేవుల నాయక్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండమీది వెంకటేష్ దేవుల నాయక్ ను ఘనంగా శాలువాతో సత్కరించి, పవిత్రమైన భగవద్గీత గ్రంథాన్ని అందజేశారు. సాధారణంగా రాజకీయ నాయకుల జన్మదినాల్లో పూలదండలు, కేకులు ఇవ్వడం సాధారణం, కానీ ఇక్కడ భగవద్గీతను బహూకరించడం అక్కడున్న వారందరి మన్ననలు పొందింది. బండమీది వెంకటేష్ మాట్లాడుతూ... "దేవుల నాయక్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కుగా పార్టీ కష్టకాలంలో కూడా జెండా వదలకుండా మోసిన ధీరుడని కొనియాడారు. తమ లాంటి వారికి , బి.సి. సమాజానికి ఆయన మార్గదర్శకుడన్నారు ఆయనకు కేవలం శాలువా కాదు, జీవితానికి దారి చూపే భగవద్గీతను ఇవ్వాలని ఈ కానుక ఇచ్చామన్నారు. భగవద్గీత చెప్పినట్లు ధర్మం కోసం ఆయన చేస్తున్న సేవ ఇలాగే కొనసాగాలని, ఆయనకు భగవంతుడు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరుకుంటున్నా" తెలిపారు. దేవుల నాయక్ స్పందిస్తూ... "బండమీది వెంకటేష్ ఇచ్చిన ఈ భగవద్గీత తన జీవితంలో మర్చిపోలేని కానుక అన్నారు. ఇది కేవలం పుస్తకం కాదని, ఒక బాధ్యత అన్నారు. పార్టీ కోసం, ప్రజల కోసం చివరి వరకు పనిచేస్తా" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, బి.సి. సంక్షేమ సంఘం సభ్యులు, దేవుల నాయక్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాచేపల్లిలో గర్భిణీలకు పౌష్టికాహార పంపిణీ



**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి గ్రామ పంచాయతీలో ఈరోజు ఉదయం 11 గంటలకు నేలకొండపల్లి భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు పచ్చ తిరుపతయ్య, కార్యదర్శి గేల్లా వెంకటరమణ గుప్తా, కోశాధికారి దండ రవీంద్రబాబు, నాచేపల్లి గ్రామ సర్పంచ్ భూక్యా మౌనిక, డాక్టర్ మాధవి, ఉపాధ్యక్షులు తెల్లగొర్ల లింగస్వామి, కోడూరు వెంకటాచారి, మాజీ అధ్యక్షులు గేల్లా జగన్మోహన్ రావు, ఎల్లంపల్లి శ్రీనివాసరావు, పొన్నగంటి శ్రీనివాస్, ఈసీ సభ్యులు ఏటుకూరు వెంకట రామారావు, చావా గణపతిరావు, షేక్ ఖాసిం సాహెబ్, మందడపు వెంకటేశ్వర్లు, చిట్ల భాస్కర్ రెడ్డి, దేవరశెట్టి లక్ష్మణరావు, కొత్తా వేణు, రేలా నరసింహారెడ్డి, ఎర్ర సైదయ్య, గ్రామ పెద్దలు నేరెళ్ల నరసింహారావు, బండి వెంకటి, మందడి నాగేశ్వరరావు, గార్లపాటి తదితరులు పాల్గొన్నారు.

# రామారెడ్డి రైతు వేదిక నుండి వీడియో కాన్ఫరెన్స్

**రాష్ట్ర స్థాయి నుండి సూచనలు**



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, చీఫ్ సెక్రెటరీ సంజయ్ జజు, వ్యవసాయ శాఖ ఉన్నత అధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొని రైతులకు దిశ నిర్దేశం చేశారు.ప్రత్యామ్నాయ పంటల సాగు, సమగ్ర వ్యవసాయ విధానాలతో రైతులకు అధిక ఆదాయం పొందాలి.నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలి కామారెడ్డి జిల్లాలో ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదలను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుంటూ, సమగ్ర వ్యవసాయ విధానాలు, సహజ వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం పొందవచ్చని తెలిపారు. ప్రస్తుత వానాకాలంలో వర్షపాతం లోటు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులు ముందస్తు ప్రణాళికతో వ్యవసాయం చేపట్టాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొని పంటల సాగు, నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలపై చర్చించడం జరిగింది. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో భూగర్భ జలమట్టాలు సగటున నాలుగు మీటర్ల మేర తగ్గిన నేపథ్యంలో నీటి వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధిక నీరు అవసరమయ్యే వరి సాగుకు బదులుగా కంది, పెసర, మినుములు, శనగలు, వేరుశనగ, సూర్యకాంతి, జొన్న, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను నేల స్వభావం, స్థానిక పరిస్థితులు, నీటి లభ్యతకు అనుగుణంగా సాగు చేయాలని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు తీసుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని కోరారు.సమగ్ర వ్యవసాయం చేయలని సూచించారు. పంటల వైవిధ్యం, సహజ వ్యవసాయ పద్ధతులు, నీటి సంరక్షణతో రైతులు వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చుకోవచ్చని సూచించారు. భూమిలో పసుపు, ఉల్లిగడ్డ, కూరగాయలు, పెసర్లు, డ్రాగన్ ఫ్రూట్ వంటి పలు రకాల పంటలను సాగు చేయాలని సూచించారు. వర్షపు నీటిని నిల్వ చేసుకునేందుకు పొలంలో నీటి కుంటను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులు నీటి లభ్యతను అంచనా వేసుకుని పంటల ఎంపికలో తగిన మార్పులు చేసుకోవాలని, పామాయిల్ వంటి దీర్ఘకాలిక పంటలతో పాటు అనువైన అంతర పంటలను సాగు చేయడం ద్వారా అదనపు ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, నేల ఆరోగ్య పరిరక్షణ, పంటల వైవిధ్యం, సహజ వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచలకురాలు సుధామధురి, మండల వ్యవసాయ అధికారి భానుశ్రీ, రామారెడ్డి సర్పంచ్ బండి ప్రవీణ్, అడ్లూరు ఎల్లారెడ్డి పిఏసిఎస్ చైర్మెన్ లింగా గౌడ్, డైరెక్టర్లు రవి గౌడ్, నర్సింలు, ఆత్మ డైరెక్టర్ రవి, మహమ్మద్ రావుఫ్ , వ్యవసాయ విస్తరణ అధికారి రాకేష్, బబిత, తహసిల్దార్ ఉమలత, ఎంపీడీవో నాగేశ్వర్, పశు వైద్యాధికారి రామ చందర్, ఉప సర్పంచ్ నవీన్, తదితర అధికారులు రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ చేసిన గ్రామ సర్పంచ్ గొల్ల మహేష్



**రామారెడ్డి, రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం కన్నాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు పన్యాల అనురాధ, పెద్ద లక్ష్మి ఇందిరమ్మ ఇళ్లకు సోమవారం రోజున గ్రామ సర్పంచ్ భూమి పూజ చేసి ముగ్గు పోశారు, ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ యశ్వంత్, గ్రామపంచాయతీ సెక్రటరీ కల్పన, వార్డ్ సభ్యులు, ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ , లబ్ధిదారులు తదితరులుపాల్గొన్నారు.

# దేవాలయాలపై ప్రైవేట్ వ్యక్తుల పెత్తనం అరికట్టాలి

**ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి**
**సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ డిమాండ్**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి: నేలకొండపల్లి పట్టణంలో ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన దేవాలయాలపై ప్రైవేట్, అదృశ్య వ్యక్తులు పెత్తనం చలాయిస్తున్నారని సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ ఆరోపించారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి పేరుతో కొంత ఖర్చు పెట్టి, పూర్తి దేవాలయాన్ని తమ స్వాధీనంలోకి తీసుకుని, ఆదాయ, ఖర్చుల లెక్కలు, భక్తులు వేసే కానుకల వివరాలు ఏవీ చూపకుండా పబ్బం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రెండు సంవత్సరాల క్రితమే ఖమ్మం జిల్లా అధికారులు విచారణ చేసి బైరిగిగుట్ట ఆంజనేయస్వామి, కోనేరు ఆంజనేయస్వామి దేవాలయాలను స్వాధీనం చేసుకుంటామని చెప్పారని, కానీ ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు.తాజాగా నిన్న ఉత్తరేశ్వరస్వామి దేవాలయంలో దేవీ నవరాత్రుల కోసం ఒక భక్తుడు ఇచ్చిన అమ్మవారి విగ్రహాన్ని, ఆ భక్తుడికి తెలియకుండానే రాత్రికి రాత్రే ఒక ప్రైవేట్ మండపానికి తరలించారని ఆరోపించారు. భక్తుడు పట్టు వస్త్రం, పూజా సామాగ్రితో గుడికి వెళ్లగా అక్కడ విగ్రహం లేకపోవడంతో ఆరా తీయగా, కొంతమంది ఒత్తిడితో తరలించినట్లు చెప్పారని తెలిపారు.ఈ ఘటనపై అధికారులు వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని, నేలకొండపల్లిలోని అన్ని దేవాలయాలను ప్రభుత్వం పూర్తిగా స్వాధీనం చేసుకుని, ప్రైవేట్ వ్యక్తుల పెత్తనాన్ని అరికట్టాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపడతానని పసుమర్తి శ్రీనివాస్ హెచ్చరించారు.



# రెడ్ క్రాస్ చైర్మన్ క్రాంతి కుమార్ కు సన్మానం



**రాజముద్ర న్యూస్, ఆదిలాబాద్:** ఇటీవల ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆదిలాబాద్ జిల్లా శాఖ చైర్మన్ గా నూతనంగా ఎన్నికైన డాక్టర్ అడే క్రాంతి కుమార్ ను లైవ్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ ఆధ్వర్యంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ మానవసేవే లక్ష్యంగా రెడ్ క్రాస్ సొసైటీ సేవలు మరింత విస్తృతంగా అందించాలని కోరారు. సేవా కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆవుపై చిరుతపులి దాడి





**రాజముద్ర న్యూస్, తాండూర్:** మండల పరిధిలోని అడవిలో చిరుతపులి దాడి చేయడంతో ఒక ఆవు మృతి చెందింది. గోలేటి గ్రామానికి చెందిన జరుపుల సుంగు నాయక్ చెందిన ఆవు గోలేటిలోని ఆవుల మందతో కలిసి రోజూలాగే శనివారం ఉదయం గోలేటి సమీప అటవీ ప్రాంత శివారుకు మేత కోసం వెళ్లింది. సాయంత్రం మిగతా పశువులన్నీ ఇంటికి తిరిగి రాగా, ఆయన ఆవు మాత్రం రాలేదు. ఆందోళన చెందిన రైతు ఆదివారం ఉదయం అటవీ పరిసర ప్రాంతాల్లో గాలించగా, సమీప పొదల్లో ఆవు మృతదేహం కనిపించింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ గౌరీశంకర్, బీట్ ఆఫీసర్ రాజ్యలక్ష్మి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. అక్కడ లభించిన వన్యమృగం పాదముద్రల ఆధారంగా ఇది చిరుతపులి దాడేనని నిర్ధారించారు. బాధితుడికి నష్టపరిహారం కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు అధికారులు తెలిపారు.

# రామారావు బాపు మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ



**రాజముద్ర న్యూస్, నేరడిగొండ (ఇచ్చోడ):** దేవి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని ఇచ్చోడ మండలంలోని సాత్ నంబర్ గ్రామంలో సోమవారం బంజారా సమాజ ఆరాధ్య గురువు శ్రీ తపస్వి రామారావు బాపు మహారాజ్ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు భూమి పూజ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బంజారా సమాజ ఆధ్యాత్మిక గురువు శ్రీ ప్రేమ్ సింగ్ మహారాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే డాక్టర్ అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రేమ్ సింగ్ మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గ్రామానికి వచ్చిన ప్రేమ్ సింగ్ మహారాజ్ కు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బంజారా సాంప్రదాయాలను, గురువుల ఆశయాలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రాథోడ్ సజన్, సర్పంచ్ రాథోడ్ రమేష్, ఉప సర్పంచ్ షబ్బీర్ అలీ, నాయక్ బన్సి, కారోబారి పవార్ నూర్ సింగ్, చౌహాన్ బాపురావు, తో పాటు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మైనార్టీ కాంగ్రెస్ నాయకులకు ఘన సన్మానం



**రాజముద్ర న్యూస్, ఇచ్చోడ:** నూతనంగా ఎన్నికైన ఆదిలాబాద్ జిల్లా మైనార్టీ వైస్ చైర్మన్ మహమ్మద్ ముస్తఫా, జిల్లా మైనార్టీ కార్యదర్శి అబ్దుల్ రషీద్లను సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ మైనార్టీల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పార్టీలో మైనార్టీలకు కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సన్మానం అనంతరం మహమ్మద్ ముస్తఫా, అబ్దుల్ రషీద్ మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. మైనార్టీలతో పాటు అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ శంషాద్దీన్, మండల ఉపాధ్యక్షుడు చోలే ప్రభాకర్, నడికుంట ఆశన్న, అధికార ప్రతినిధి బొజ్జ రవి, ప్రధాన కార్యదర్శి వెంకట్రెడ్డి, పట్ల గోవర్ధన్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ కదం శివాజీ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు జవాన్ రామదాసు, బాప్రావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళపై గుర్తు తెలియని దుండగుల దాడి

- చేవెళ్ల మండలం మీర్జాగూడ గేటు సమీపంలో ఘటన...
- మహిళకు తీవ్ర రక్త గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలింపు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు



**చేవెళ్ల, రాజముద్ర న్యూస్:** ఒంటరి మహిళపై అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు దాడి చేసిన సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. చేవెళ్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం (12.10.2026) నాడు ఉదయం సుమారు 06:00 గంటలకు పర్వేద శంకరయ్య (సెల్ నెం. 9989402575)100 డయల్ కు ఫోన్ చేసి మిర్జాగూడ గేట్ వద్ద ఒక గుర్తు తెలియని మహిళ రక్త గాయాలతో పడి ఉందని సమాచారం ఇవ్వగా, వెంటనే పెట్రోల్ మొబైల్ సిబ్బంది అక్కడికి వెళ్లి చూడగా, చేవెళ్ల నుండి వికారాబాద్ వెళ్లే రోడ్డు మార్గంలో మిర్జాగూడ గ్రామ పరిధిలోని మిర్జాగూడ గేట్ కు ఎడమవైపు సుమారు 100 మీటర్ల దూరంలో ఉన్న పొలంలో ఒక గుర్తు తెలియని మహిళ రక్త గాయాలతో పడి ఉండటం గమనించారు. వెంటనే ఆమెను చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం పట్నం మహేందర్ రెడ్డి హాస్పిటల్ తరలించి అడ్మిట్ చేయడం జరిగింది. అనంతరం బాధితురాలు కల్సాని వీణ, తండ్రి ఇంద్రా రెడ్డి, వయస్సు: 26 సం//లు, నివాసం ప్రేమ్ నగర్ కాలనీ, హఫీజ్ పేట్, శేరిలింగంపల్లిగా గుర్తించడం జరిగింది. ఆమె తండ్రి కల్సాని ఇంద్రా రెడ్డి S/o సోమ నర్సింహా రెడ్డి, వయస్సు 55 సం//లు, వృత్తి సెక్యూరిటీ గార్డ్, సెల్ నెం. 9959418240 హాస్పిటల్ కు చేరుకున్నారు. విచారణలో బాధితురాలు చిన్నప్పటి నుండి మానసిక స్థితి సరిగ్గా లేదని, 2024 ఫిబ్రవరిలో పాలకుర్తికి చెందిన జగన్ అనే వ్యక్తితో వివాహం జరిగి ఒక నెలలోనే విడాకులు అయ్యాయని, ఏఐజి, కాంటినెంటల్ హాస్పిటల్ లో, అలాగే 2025వ సంవత్సరంలో ఎర్రగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిలో 3 నెలలు చికిత్స పొందిందని, అప్పుడప్పుడు ఇంటి నుండి వెళ్లి 3-4 రోజుల తర్వాత తిరిగి వస్తుందని, ఈసారి తేది 03.10.2026 న ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. తన కూతురిని ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పదునైన ఆయుధంతో దాడి చేసి తలపై రక్త గాయాలు చేశారని తండ్రి ఫిర్యాదు చేశారు. దీనిపై చేవెళ్ల పీస్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు. బాధితురాలు చికిత్స పొందుతుందని తెలిపారు.

# ఎస్ ఐ ఆర్ లో ఓట్ల తొలగింపు పై నేడు భారీ ర్యాలీ



**కామారెడ్డి, రాజముద్ర న్యూస్:** తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం,బహుజన సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు,ప్రజా సంఘాలు, మాల మహానాడు, ఎమ్మార్పీఎస్ అన్ని బీసీ సంఘాలు విద్యార్థి సంఘాలు అన్ని కలిసి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు మున్సిపల్ వద్దకు రావాల్సిందిగా కోరుతున్నాం.... విషయం ఏమిటంటే కేంద్ర ఎన్నికల కమిషన్ భారత దేశంలో ఎస్ ఐ ఆర్ SIR ద్వారా ఓట్లను తొలగించడం జరుగుతుంది. దాంట్లో భాగంగా భారతదేశంలో 13 కోట్ల ఓట్లను తొలగించడం జరిగింది. ఆ విషయం పైన దేశవ్యాప్తంగా జంజీ ఉద్యమం తీవ్రరూపకంగా నడుస్తున్న సంగతిని మనమందరం చూస్తున్నా దేశవ్యాప్తంగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ మహిళల ఓట్లను ప్రత్యేకంగా తొలగించడం జరుగుతుంది. ఇది కుట్రపూరితంగా చేస్తున్నటువంటి విషయంగా బహిర్గతమైంది కావున కేంద్ర ఎన్నికల కమిషన్ ఉన్నటువంటి మిగతా ఇద్దరు సభ్యులు కూడా 14 సార్లు ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్వర్ నిర్ణయాలను వ్యతిరేకించడం జరిగింది. దానివలన రేపు ఓటు హక్కు లేని ప్రజలు కోట్లలో ఉండే అవకాశం ఉంది ఈ దేశంలో మనం పుట్టాము మన నాన్నలు పుట్టారు మన తాతలు పుట్టారు ఆ కాలం నుంచి ఓట్లు వేస్తూ వస్తున్నారు, ఆ కాలం నుంచి కూడా ప్రభుత్వానికి చెల్లించే టాక్స్లు కడతా ఉన్నారు టాక్సులు తీసుకుంటున్నారు కానీ ఓటు మాత్రం తీసేస్తున్నారు సోదరులారా అర్థం చేసుకోండి ఇది భయంకరమైన పరిస్థితి భవిష్యత్తులో రాబోతుంది ఎమ్మెల్యేను ఎంపీను ఓటరు ఎన్నుకునే పరిస్థితి ఉండేది కానీ ఈరోజు ఓటరుని ఎవరు ఓటేస్తారు ఎవరు ఓటెయ్యరు అని గుర్తించి ఎన్నుకునే పరిస్థితి ఏర్పడతా ఉంది ఓటు పడది అని అనుకున్నప్పుడు ఆ ఓటును తొలగించే ప్రయత్నం చేస్తా ఉన్నారు ఇది దేశవ్యాప్తంగా జరుగుతా ఉంది కావున దేశవ్యాప్తంగా నిరసన కూడా జరుగుతా ఉంది రేపు మనవాళ్లె మన సోదరులు ఓట్లు ఉండాలంటే ఇప్పుడు దాన్ని ఎదుర్కోవాలి SIR ప్రక్రియను వ్యతిరేకించాలి . కావున సోదరులారా మనమందరం ఐక్యంగా ఈ ప్రక్రియ పట్ల నిరసన వ్యక్తం చేయాల్సిన అవసరం ఉంది వ్యతిరేకించవలసిన అవసరం ఉంది కావున రేపు మంగళవారం కామారెడ్డి జిల్లాలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరుగుతుంది. కాబట్టి అన్ని సంఘాల నాయకులు ప్రతి గ్రామనికి సమాచారం ఇచ్చి పెద్ద ఎత్తున రావాల్సిందిగా కోరుతా ఉన్నాం ఈ ర్యాలీ,నిరసనను విజయవంతం చేసే బాధ్యత అన్ని సంఘాల పైన ఉంది. కాబట్టి ప్రతి ఒక్కరు ప్రతి ఒక్కరికి సమాచారం ఇచ్చి తప్పకుండా ఈ నిరసనను విజయవంతం చేద్దామని అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొత్తల గంగారం, జిల్లా నాయకులు కోరారు.

# ఖమ్మం ఆధ్యాత్మిక వైభవానికి మరో మణిహారం

- చిన్నజీయర్ స్వామి సమక్షంలో శ్రీవారి ఆలయానికి శంకుస్థాపన
- పాల్గొన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్




**రాజముద్ర న్యూస్, సత్తుపల్లి:** ఖమ్మం నగరంలోని అల్లిపురం వద్ద శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక గురువు చిన్నజీయర్ స్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేపట్టడం సంతోషకర మన్నారు. ఆలయ నిర్మాణానికి సహక రించిన ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. మధ్య ప్రదేశ్లో ముఖ్యమైన కార్యక్రమాలు ఉన్నప్పటికీ, తన విజ్ఞప్తి మేరకు ఖమ్మం విచ్చిన చిన్నజీయర్ స్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు చిన్నజీయర్ స్వామి చేతుల మీదుగా శ్రీకారం చుట్టిన విషయాన్ని గుర్తుచేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో ఆలయ నిర్మాణ పనులు విజయవంతంగా పూర్తికావాలని ఆకాంక్షించారు. భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం నగర ఆధ్యాత్మిక ప్రాభవాన్ని మరింత పెంచేలా, నగర కీర్తి ప్రతిష్ఠలకు ప్రతీకగా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం నిలవాలని ఆకాంక్షించారు.

# ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- గంభీరావుపేట నుంచి వంద బైకులతో కాంగ్రెస్ భారీ ర్యాలీ



**రాజముద్ర న్యూస్, గంభీరావుపేట:** దేశంలో ఓటు చోరీ జరుగుతోందని కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలకు నిరసనగా, అఖిల భారత కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేపడుతున్న పోరాటానికి మద్దతుగా గంభీరావుపేట మండల కాంగ్రెస్ శ్రేణులు సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సుమారు వంద బైకులతో ర్యాలీగా బయలు దేరి సిరిసిల్ల పట్టణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం గంభీరావుపేట మండల కేంద్రంలో మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్ విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ సంస్థలపై తన ప్రభావాన్ని చూపుతోందని ఆరోపించారు. ముఖ్యంగా భారత ఎన్నికల కమిషన్ ద్వారా రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. దేశంలోని కోట్లాది మంది ఓట్లను తొలగించి, ఓటు చోరీ ద్వారా వివిధ రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చారని కాంగ్రెస్ ఆరోపిస్తోందని తెలిపారు. ఇలాంటి పరిణామాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. ఓటు హక్కు పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ గత కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నారని, ఆయన చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి మద్దతు లభిస్తోందని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా యువత ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాల్లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పర్ష హన్మాండ్లు, తిరుపతి, రాజనర్సింహారెడ్డి, గంగి స్వామి, శ్రీనివాస్, మేడ భాస్కర్, కూడలి లచ్చయ్య, ఓరుగంటి నర్సింలు, కొత్తపల్లి బాల్రెడ్డి, అజ్మీర భాస్కర్, పుల్లూరి సంతోష్ గౌడ్, ఆనంద్, రామచంద్రారెడ్డి, తోక రవి, బందెల రాజు, ఎగదండి మహేష్, పెద్దవేని రాజు, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# హరిహర ప్రీమియర్ లీగ్ సీజన్-4

# విజేతగా హరిహర లయన్స్

## రన్నరప్‌గా హరిహర జైంట్స్.. విజేతలకు ట్రోఫీ అందజేసిన శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ ఎండీ యాదవ రెడ్డి




**పీర్జాదిగూడ, రాజముద్ర న్యూస్:**

తూర్పు హైదరాబాద్‌లో ప్రముఖ గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణ సంస్థ శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన హరిహర ప్రీమియర్ లీగ్ (హెచ్‌హెచ్‌పీఎల్) సీజన్–4 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో హరిహర లయన్స్ జట్టు అద్భుత ప్రతిభ కనబరిచి విజేతగా నిలవగా, హరిహర జైంట్స్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.

హరిహర గ్రూప్‌కు చెందిన వివిధ గేటెడ్ కమ్యూనిటీల నివాసితుల మధ్య స్నేహభావం, ఐక్యతను పెంపొందించడంతోపాటు క్రీడాస్ఫూర్తిని ప్రోత్సహించాలనే లక్ష్యంతో ప్రతి సంవత్సరం ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా నిర్వహించిన నాలుగో సీజన్ పోటీలు క్రీడాభిమానులను ఆకట్టుకున్నాయి. లీగ్ దశలో ప్రతిభ కనబరిచిన జట్లు ఫైనల్‌కు చేరుకోగా, ఆదివారం జరిగిన తుది పోరులో హరిహర లయన్స్, హరిహర జైంట్స్ జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్‌లో హరిహర లయన్స్ విజయం సాధించి ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా శ్రీ సాయి హరిహర ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ అప్పిడి యాదవ రెడ్డి విజేత హరిహర లయన్స్ జట్టుకు ఛాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేసి క్రీడాకారులను అభినందించారు. రన్నరప్‌గా నిలిచిన హరిహర జైంట్స్ జట్టును సైతం అభినందించారు. ఈ సందర్భంగా యాదవ రెడ్డి మాట్లాడుతూ, హరిహర గ్రూప్ పరిధిలోని వివిధ గేటెడ్ కమ్యూనిటీల నివాసితుల మధ్య స్నేహపూర్వక పరిచయాలను పెంపొందించడం, పరస్పర సంబంధాలను బలోపేతం చేయడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే హరిహర ప్రీమియర్ లీగ్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, సమష్టి భావనను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. నివాసితులందరినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చేలా భవిష్యత్తులో మరిన్ని క్రీడా, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తామని వెల్లడించారు. హరిహర ప్రీమియర్ లీగ్ వ్యవస్థాపకుడు హరి రెడ్డి, విజేత హరిహర లయన్స్ జట్టు కెప్టెన్ రాజశేఖర్ వర్మ, వైస్ కెప్టెన్ అమర్ సింహా, టోర్నమెంట్ నిర్వాహకులు సైదులు గౌడ్, వినయ్ రెడ్డి, రమేష్ రెడ్డి, చేతన్, ప్రవీణ్ రెడ్డి, నర్సయ్య, సురేందర్‌తోపాటు వివిధ జట్ల క్రీడాకారులు, హరిహర గ్రూప్ గేటెడ్ కమ్యూనిటీల నివాసితులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. హరిహర ప్రీమియర్ లీగ్ కేవలం క్రికెట్ పోటీలకే పరిమితం కాకుండా, వివిధ కమ్యూనిటీల కుటుంబాల మధ్య స్నేహసంబంధాలు, ఐక్యత, సమష్టి భావనను పెంపొందించే వేదికగా నిలుస్తోందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ప్రిన్స్ యాదవ్ అరుదైన రికార్డు!

**స్పోర్ట్స్ డెస్క్ :**

వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో టీమిండియా విజయంలో ప్రిన్స్ యాదవ్ చేసింది 13 పరుగులే అయినా కీలక పాత్ర పోషించాడు. బౌలింగ్‌లో 4 ఓవర్లు వేసి వికెట్ లేకుండా 37 పరుగులు ఇచ్చిన అతడు.. బ్యాట్‌తో మాత్రం జట్టుకు విలువైన పరుగులు అందించాడు. నంబర్ 10లో బ్యాటింగ్‌కు వచ్చిన ప్రిన్స్ యాదవ్ కేవలం 6 బంతుల్లోనే 3 ఫోర్లతో 13 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. భారత్ ఈ మ్యాచ్‌లో 14 పరుగుల తేడాతోనే విజయం సాధించడంతో ప్రిన్స్ చేసిన 13 పరుగుల ప్రాధాన్యత ఏంటో అర్థమవుతుంది. అతడు చివర్లో బౌండరీలు బాదడంతో భారత్ 223 పరుగుల స్కోరు సాధించగలిగింది. ఈ మూడు ఫోర్లతో ప్రిన్స్ యాదవ్ టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన జాబితాలో చేరాడు. నంబర్ 10 లేదా నంబర్–11 స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి ఒక ఇన్నింగ్స్‌లో కనీసం మూడు బౌండరీలు బాదిన భారత బ్యాటర్లలో ప్రిన్స్ యాదవ్ ఇప్పుడు మూడో ఆటగాడిగా నిలిచాడు. ఈ ప్రత్యేక ఘనత సాధించిన మిగిలిన ఇద్దరు భారత ఆటగాళ్లు ఎస్. శ్రీశాంత్, రవిచంద్రన్ అశ్విన్. శ్రీశాంత్ 2007లో న్యూజిలాండ్‌పై ఈ రికార్డు సాధించగా.. అశ్విన్ 2011లో ఇంగ్లాండ్‌పై కోల్‌కతా టీ20లో మూడు బౌండరీలు బాదాడు. అశ్విన్ తర్వాత దాదాపు 15 ఏళ్లకు నంబర్–10 లేదా 11 స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన భారత ఆటగాడు టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో మూడు బౌండరీలు బాదడం ఇదే తొలిసారి. మూడో టీ20లో భారత్ వెస్టిండీస్‌పై 14 పరుగుల తేడాతో విజయం సాధించింది.

# బౌలర్లకు చుక్కలు చూపించిన అన్వయ్..

- **రాహుల్ ద్రవిడ్ వారసుడి విధ్వంసం..**

**స్పోర్ట్స్ డెస్క్:**



టీమిండియా మాజీ కెప్టెన్, హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ చిన్న కుమారుడు అన్వయ్ ద్రవిడ్ తన బ్యాటింగ్‌తో క్రికెట్ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. వినూ మంకడ్ ట్రోఫీ అండర్–19 టోర్నీలో ఢిల్లీ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో అన్వయ్ కేవలం 41 బంతుల్లోనే 85 పరుగులు చేసి అదరగొట్టాడు. అతడి దూకుడైన ఇన్నింగ్స్‌తో కర్ణాటక జట్టు భారీ స్కోరు సాధించడంలో కీలక పాత్ర పోషించాడు.

**41 బంతుల్లోనే 85 పరుగులు.. ఐదు సిక్సర్లు**

విశాఖపట్నంలో జరిగిన ఈ మ్యాచ్‌లో కర్ణాటక అండర్–19 జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన అన్వయ్ ద్రవిడ్ ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 41 బంతుల్లో 85 పరుగులు సాధించి తన సత్తా చాటాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఐదు భారీ సిక్సర్లు, ఏడు ఫోర్లు బాదాడు. 207.32 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు సాధించి వేగవంతమైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. వికెట్ కీపర్‌గా కూడా వ్యవహరిస్తున్న అన్వయ్, అవసరమైన సమయంలో దూకుడుగా ఆడగలనని ఈ ఇన్నింగ్స్‌తో చూపించాడు.

**గత వారమే సెంచరీ.. మరోసారి అద్భుత ప్రదర్శన**

అన్వయ్ ద్రవిడ్ ఇటీవల కూడా తన బ్యాటింగ్‌తో వార్తల్లో నిలిచాడు. గత వారంలో చండీగఢ్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం 62 బంతుల్లోనే 104 పరుగులు చేసి సెంచరీ సాధించాడు. ఇప్పుడు ఢిల్లీపై మరోసారి వేగవంతమైన ఇన్నింగ్స్ ఆడి తన ఫామ్‌ను కొనసాగించాడు. వరుసగా మంచి ప్రదర్శనలు చేస్తూ అండర్–19 దేశీయ క్రికెట్‌లో తనకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్నాడు.

**కర్ణాటక భారీ స్కోరు.. ధ్రువ్ కృష్ణ సెంచరీ**

ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్ణాటక జట్టు 49 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 418 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టు తరపున ధ్రువ్ కృష్ణ కూడా అద్భుతంగా రాణించాడు. కేవలం 51 బంతుల్లోనే 103 పరుగులు చేసి సెంచరీ సాధించాడు. అన్వయ్ ద్రవిడ్ కూడా చివరి దశలో వేగంగా పరుగులు సాధించడంతో కర్ణాటక స్కోరు 400 పరుగుల మార్కును దాటింది.

**ఢిల్లీపై కర్ణాటకకు 198 పరుగుల విజయం**

419 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ జట్టు కర్ణాటక బౌలర్లను ఎదుర్కోలేకపోయింది. ఢిల్లీ జట్టు 220 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో అన్వయ్ ద్రవిడ్ కెప్టెన్సీలోని కర్ణాటక జట్టు 198 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అన్వయ్ తన బ్యాటింగ్‌తో పాటు వికెట్ కీపింగ్, కెప్టెన్సీ బాధ్యతలతోనూ ఆకట్టుకున్నాడు. మొత్తంగా, రాహుల్ ద్రవిడ్ కుమారుడు అన్వయ్ ద్రవిడ్ వినూ మంకడ్ ట్రోఫీలో వరుసగా మంచి ఇన్నింగ్స్‌లతో అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. 41 బంతుల్లో 85 పరుగులు, అంతకుముందు 62 బంతుల్లో సెంచరీ సాధించడం అతడి దూకుడైన బ్యాటింగ్‌కు ఉదాహరణగా నిలుస్తున్నాయి..

# వైభవ్‌కు చోటు కష్టమే..?: అశ్విన్



టీమిండియా–వెస్టిండీస్ జట్ల మధ్య టీ20 సిరీస్ ఆసక్తికరంగా కొనసాగుతోంది. ఈ సిరీస్‌లో భాగంగా నాలుగో టీ20 మ్యాచ్ ఈ నెల 14న హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనుంది. ఇప్పటివరకు జరిగిన మూడు మ్యాచ్‌ల్లో భారత్ రెండు విజయాలు సాధించి సిరీస్‌లో ఆధిక్యంలో ఉండగా.. రెండో టీ20లో మాత్రం లక్నో వేదికగా భారత్ ఓటమి చవిచూసింది. తొలి, మూడో టీ20ల్లో టీమిండియా విజయం సాధించింది. ఈ సిరీస్‌కు ఎంపికైన 15 ఏళ్ల యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీకి ఇప్పటివరకు తుది జట్టులో ఆడే అవకాశం రాలేదు. జట్టులో చోటు దక్కినప్పటికీ, అతడిని ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తీసుకోకపోవడంపై క్రికెట్ అభిమానుల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ వైభవ్ ఎంపిక, సంజూ శాంసన్ ప్రదర్శనపై తన అభిప్రాయాలను వెల్లడించాడు.

**సంజూ శాంసన్ ప్రదర్శనతో వైభవ్‌కు ఎదురుచూపులు..!**

తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన అశ్విన్.. ప్రస్తుతం సంజూ శాంసన్ తన ప్రదర్శనతో జట్టులో స్థానం నిలబెట్టుకుంటున్నాడని అభిప్రాయపడ్డాడు. దీంతో వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కడం కష్టమవుతోందని పేర్కొన్నాడు. వైభవ్‌కు కూడా అవకాశం ఇవ్వాల్సిన అవసరం ఉందని, అయితే ఇలాంటి పరిస్థితులు క్రికెట్‌లో సహజమని వ్యాఖ్యానించాడు. టీమిండియా మేనేజ్‌మెంట్ అభిషేక్ శర్మను జట్టు నుంచి తప్పించే పరిస్థితి లేదని అశ్విన్ పేర్కొన్నాడు. అభిషేక్ అద్భుతమైన ఆటగాడని, అతడి బ్యాట్ పనిచేస్తే భారత్‌కు మ్యాచ్‌లు గెలిపించగలడని ప్రశంసించాడు. దీంతో సంజూ శాంసన్, వైభవ్ సూర్యవంశీ మధ్య జట్టులో స్థానం కోసం పోటీ నెలకొందని వివరించాడు.

**అభిషేక్ శర్మపై అశ్విన్ ప్రశంసలు**

వెస్టిండీస్‌తో జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ప్రదర్శనపై అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగిన అభిషేక్ కేవలం 30 బంతుల్లోనే 69 పరుగులు చేసి భారత జట్టుకు అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. అతడి దూకుడైన బ్యాటింగ్ జట్టు స్కోరు వేగంగా పెరగడానికి దోహదపడింది. గత రెండు నెలలుగా అభిషేక్ శర్మ తన ఆటలో పరిస్థితులకు అనుగుణంగా మారగల సామర్థ్యాన్ని చూపిస్తున్నాడని అశ్విన్ తెలిపాడు. జపాన్‌లో జరిగిన మ్యాచ్‌లో పిచ్ బ్యాటింగ్‌కు అంతగా అనుకూలంగా లేకపోయినా అభిషేక్ అద్భుతంగా ఆడాడని గుర్తుచేశాడు. ఇండోర్‌లోనూ పిచ్ సులభంగా లేకపోయినప్పటికీ, అదే తరహాలో మంచి బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచాడని ప్రశంసించాడు. మొత్తంగా, సంజూ శాంసన్ ప్రస్తుత ప్రదర్శన, అభిషేక్ శర్మకు జట్టులో ఉన్న ప్రాధాన్యం కారణంగా వైభవ్ సూర్యవంశీకి అవకాశం రావడం ఆలస్యమవుతోందన్నది అశ్విన్ అభిప్రాయం.

# ఆ ప్రపంచకప్ ఓటమి నుంచి చాలా నేర్చుకున్నా..



**స్పోర్ట్స్ డెస్క్ :** అంతర్జాతీయ క్రికెట్ రంగంలో భారత జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ అగ్రశ్రేణి ఆటగాడిగా కొనసాగుతున్న రోహిత్ శర్మ తన ఆట జీవితంలోని కీలక ఘట్టాల గురించి ఎప్పుడూ ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటారు. మైదానం లో జట్టును విజయపథంలో నడిపించడంలో ఆయన ఎంతో అనుభవాన్ని ప్రదర్శిస్తుంటారు. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన టోర్నమెంట్ల ఫలితాలు అలాగే ఓటముల నుంచి తాను నేర్చుకున్న పాఠాల గురించి ఆయన ఇటీవల ఒక కార్యక్రమంలో స్పష్టంగా మాట్లాడారు. ఆయన పంచుకున్న ఈ అనుభవాలు ప్రస్తుతం క్రీడా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. అభిమానులు కూడా ఆయన మాటలను ఎంతో ఆసక్తిగా స్వీకరిస్తున్నారు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్‌లో ఎదురైన ఓటమి తన కెరీర్‌లో అత్యంత కఠినమైన దశ అని భారత స్టార్ ప్లేయర్ రోహిత్ శర్మ వెల్లడించారు. తన 19 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో ఎప్పుడూ ఇలాంటి మానసిక వేదన కలగలేదని ఆయన భావోద్వేగంతో గుర్తుచేసుకున్నారు. టోర్నమెంట్ అంతటా తమ జట్టు ఆడిన అద్భుతమైన తీరును పరిశీలిస్తే ఫైనల్‌లో ఓడిపోతామని తాము కలలో కూడా అనుకోలేదని తెలిపారు. ఆ ఓటమి తనను ఎంతో కుంగదీసినప్పటికీ ఆ అనుభవం నుంచి తాను చాలా ముఖ్యమైన విషయాలను నేర్చుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఒకవేళ ఆ ఓటమి నుంచి తాను పాఠాలు నేర్చుకోకపోయి ఉంటే 2024 టీ ఇరవై ప్రపంచకప్ టోర్నమెంట్‌లో ఆ పట్టుదల అలాగే తపన కచ్చితంగా కనిపించి ఉండేవి కావని ఆయన పేర్కొన్నారు. క్రీడా రంగంలో విజయం కంటే వైఫల్యాలే మనుషులకు ఎక్కువ పాఠాలు నేర్పుతాయని ఆయన గట్టిగా నమ్ముతున్నట్లు తెలిపారు. ప్రతి ఓటమి వెనుక భవిష్యత్తును మార్చే బలమైన గుణపాఠం దాగి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. క్రీడాకారులు ఒడిదుడుకులను ఎదుర్కొంటూ మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవడం ఎంత ముఖ్యమో ఆయన తన ఉదాహరణ ద్వారా వివరించారు. భారత క్రీడాభిమానులకు రోహిత్ శర్మ చెప్పిన ఈ మాటలు ఎంతగానో స్ఫూర్తినిస్తున్నాయి. రాబోయే అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో కూడా భారత జట్టు మరింత పట్టుదలతో రాణించాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# భారత్ శ్రీలంక తొలి వన్డే వేదిక మార్పు..

**ఖండించిన బీసీసీఐ.!**

**స్పోర్ట్స్ డెస్క్ :**



అంతర్జాతీయ క్రికెట్ రంగంలో జట్ల మధ్య జరిగే సిరీస్‌లకు సంబంధించి వేదికల మార్పులపై తరచూ రకరకాల వార్తలు ప్రచారంలోకి వస్తుంటాయి. ముఖ్యంగా ప్రతిష్ఠాత్మక మ్యాచ్‌లు జరిగే సమయాలలో స్టేడియాల సిద్ధతపై సోషల్ మీడియాలో రకరకాల చర్చలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో భారత జాతీయ జట్టు అలాగే శ్రీలంక జట్టు మధ్య జరగబోయే తొలి వన్డే మ్యాచ్ వేదిక మారుతుందంటూ జరుగుతున్న ప్రచారం క్రీడా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ వస్తున్న వార్తలన్నింటిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి స్పందించి అధికారికంగా స్పష్టతను అందించింది. భారత్ అలాగే శ్రీలంక జట్ల మధ్య జరగనున్న తొలి వన్డే మ్యాచ్ వేదిక మారుతుందంటూ వస్తున్న వదంతులలో ఎలాంటి నిజం లేదని బీసీసీఐ స్పష్టం చేసింది. ఈ మ్యాచ్ డిసెంబర్ 13వ తేదీన జరగాల్సి ఉండగా, ఈ వేదిక ఢిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు మారుతున్నట్లు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. కానీ ఆ ప్రచారంలో పూర్తిగా అసత్యాలు ఉన్నాయని బోర్డు తేల్చి చెప్పింది. షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్‌లు జరుగుతాయని ఎలాంటి మార్పులు ఉండవని స్పష్టం చేశారు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో ప్రస్తుతం కొన్ని నిర్మాణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ మ్యాచ్‌ను మరో వేదికకు తరలించనున్నట్లు ప్రచారం మొదలైంది. స్టేడియం పనులు అనుకున్న సమయానికి పూర్తి కాకపోవచ్చనే అనుమానాలతో ఈ ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. అయితే నిర్వాహకులు మాత్రం అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ చేసిన మైదానంలోనే మ్యాచ్ విజయవంతంగా నిర్వహించడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుత భారత పర్యటనలో భాగంగా శ్రీలంక జట్టు మొత్తం 3 వన్డేలు అలాగే 3 టీ20ల సిరీస్‌లలో తలపడనుంది. ఇరు జట్ల మధ్య జరగబోయే ఈ సిరీస్ కోసం క్రీడా అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎలాంటి మార్పులు లేకపోవడంతో షెడ్యూల్ ప్రకారమే మ్యాచ్‌లు సాగనున్నాయి. ఈ సిరీస్‌కు సంబంధించిన ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నట్లు సమాచారం అందుతోంది. రాబోయే రోజుల్లో ఈ మ్యాచ్‌లకు సంబంధించిన మరిన్ని అధికారిక వివరాలు వెలువడే అవకాశం ఉంది.

# కండక్టర్‌గా ఉన్నప్పుడే ఎక్కువ ఆనందంగా ఉండేవాణ్ని

బస్సు కండక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించి, ఆ తరువాత నటుడిగా మారారు రజనీకాంత్ (Rajinikanth). దశాబ్దాలుగా ప్రేక్షకులను అలరిస్తూ సూపర్‌స్టార్‌గా ఎదిగారు. రజనీకాంత్‌లో అభిమానులకు నచ్చేది తన నటన మాత్రమే కాదు, ఎంత ఎత్తుకు ఎదిగినా వినయంతో ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వం. ఎన్నో సందర్భాల్లో తన జీవిత ప్రయాణం గురించి మాట్లాడిన ఆయన, తాజాగా మరోసారి బెంగళూరులో బస్సు కండక్టర్‌గా చేసినప్పటి రోజులను గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం నటుడిగా అగ్రస్థాయిలో ఉన్నప్పటికీ, కండక్టర్‌గా పనిచేసినప్పుడే ఎక్కువ సంతోషంగా ఉండేవాడినని తెలిపారు.



'జైలర్ 2' (Jailer 2) ప్రచార కార్యక్రమంలో చిత్ర దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ (Nelson Dilipkumar) మాట్లాడుతూ, రజనీకాంత్‌లోని వినయం గురించి ప్రస్తావించారు. దీనికి రజనీ స్పందిస్తూ తన అంతరంగాన్ని ఆవిష్కరించారు. "నేను స్టార్‌ను అయినప్పటికీ, నాకు నటనంటే ఇష్టం. అయితే అంతకంటే బస్సు కండక్టర్‌గా పనిచేయడమే ఇంకా ఇష్టం. నేను అయిదేళ్ల పాటు కండక్టర్‌గా పనిచేశాను. ఇప్పటికీ ఆ ఉద్యోగాన్ని మిస్ అవుతుంటాను. నేను తరచూ బెంగళూరు వెళ్లేది కూడా అందుకే. నన్ను నేను ఎప్పుడూ ఓ స్టార్‌గా భావించలేదు. ఇప్పటికీ బస్సు కండక్టర్‌గానే భావిస్తుంటాను. అలాంటప్పుడు, నాలాంటి ఓ బస్సు కండక్టర్ మీలాంటి పెద్ద వ్యక్తి ముందు ఎలా ప్రవర్తిస్తారు చెప్పండి?'' అని రజనీకాంత్ అన్నారు. ఈ వ్యాఖ్యలతో ఆయన వ్యక్తిత్వం ఎంత గొప్పదో మరోసారి అర్థమైందని అభిమానులు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా, 'జైలర్'కు సీక్వెల్‌గా తెరకెక్కిన 'జైలర్ 2' అక్టోబరు 15న విడుదల కానుంది.

# నన్ను తక్కువగా అంచనా వేయడం వాళ్ల కర్మ

దాదాపు రెండు పదుల కాలంగా చిత్రపరిశ్రమలో కొనసాగుతున్న అదితి రావు హైదరీ, ఈ ప్రత్యేకమైన మైలురాయి వద్దకు చేరుకుంటున్న వేళ తన సినీ ప్రయాణంపై స్పందిస్తూ పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. అక్టోబర్ 23న తన 40వ పుట్టినరోజు జరుపుకోబోతున్న అదితి.. విజయం, ఓటములతో సంబంధం లేకుండా తన ప్రయాణం సాగుతున్నట్లు తెలిపారు. నేర్చుకున్న పాఠాలు, స్పష్టత, కృతజ్ఞతా భావంతో ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఒకవేళ ఇప్పుడున్న తాను చిన్ననాటి తనను కలిస్తే, ఎలాంటి హడావుడి లేకుండా సంతోషంగా మనలా మనం ఉండమని సలహా ఇస్తానని అదితి చెప్పారు. బయట జరిగే విమర్శలను పట్టించుకోకుండా, మనల్ని ప్రోత్సహించే మంచి వాళ్లను నమ్మాలని అన్నారు. జీవితంలో ప్రతిదీ వెంటనే తెలిసిపోవాలని తొందరపడకూడదని, కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకు వెళ్లాలని తెలిపారు. తప్పులు చేయడానికి ఎప్పుడూ భయపడకూడదని, ఆ తప్పుల నుంచే మనం మంచి పాఠాలు నేర్చుకుని గొప్పగా ఎదుగుతామని ఆమె వివరించారు. సినిమా రంగంలో తన ప్రయాణం ఎప్పుడూ అంత తేలిగ్గా సాగలేదని అదితి అన్నారు. ఎదురైన ఇబ్బందులను తలచుకుని బాధపడకుండా, ప్రతి అనుభవం తనకు ఎంతో నేర్పించిందని చెప్పడానికి సంతోషిస్తానని అన్నారు. ఇండస్ట్రీలో ఎదగడం కొండెక్కినంత కష్టంగా ఉంటుందని, కానీ ప్రతి అడుగు ముందుకు వేయడం వల్లనే అనుభవం వస్తుందని తెలిపారు. ఇకపై ఎవరితో పని చేయాలి, ఎలాంటి మంచి పాత్రలు ఎంచుకోవాలనే విషయంలో తనకు పూర్తి స్పష్టత ఉందని ఆమె స్పష్టం చేశారు. ఎవరైనా తప్పుడు పనులు చేస్తే లేదా తనను తక్కువగా అంచనా వేస్తే.. అది వారి కర్మకే వదిలేయాలని ఆమె అభిప్రాయపడ్డారు.



# నాని 'బ్లడీ రోమియో'.. షూటింగ్ డేట్ ఫిక్స్!

నేచురల్ స్టార్ నాని కొత్త అవతారంలో సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. 'సాహో', 'ఓజీ' చిత్రాల తో స్టైలిష్ యాక్షన్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ డైరెక్టర్ సుజీత్‌తో కలిసి ఆయన చేస్తున్న సినిమా 'బ్లడీ రోమియో'. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించి తాజాగా షూటింగ్ షెడ్యూల్ వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అక్టోబర్ 17 నుంచి ఢిల్లీలో సినిమా షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత లండన్, హైదరాబాద్‌లోనూ కీలక సన్నివేశాలను తెరకెక్కించేందుకు చిత్ర బృందం ప్లాన్ రెడీ చేసి నట్లు సమాచారం. ఈ సినిమాలో నాని పాత్రకు సంబంధించిన వివరాలు కూడా ఆసక్తికరంగా మారాయి. ఒకవైపు చెఫ్‌గా కనిపిస్తూనే, మరోవైపు గ్యాంగ్‌స్టర్‌గా హింసాత్మక యాంగిల్‌ని ప్లే చేసే పాత్రలో ఆయన కనిపించనున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ రెండు విభిన్నమైన షేడ్స్‌ను డైరెక్టర్ సుజీత్ ఎలా చూపించబోతున్నారన్నది ఆసక్తిని రేకెత్తిస్తోంది. డార్క్ హ్యూమర్, స్టైలిష్ యాక్షన్ అంశాలతో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక 'ది ప్యారడైజ్'లోని రగ్డ్ లుక్‌కు భిన్నంగా నాని ఈ సినిమా కోసం రెట్రో స్టైల్‌లో కనిపిస్తుండటం అభిమానుల్లో చర్చనీయాంశమైంది. కొత్త హెయిర్‌స్టైల్, బ్లాక్ గాగుల్స్‌తో ఆయన కనిపిస్తున్న లుక్ ఇప్పటికే సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. అక్టోబర్ 17న ఢిల్లీలో ప్రారంభమయ్యే తొలి షెడ్యూల్ తర్వాత లండన్, హైదరాబాద్‌లలోనూ షూటింగ్ జరగనుందని సమాచారం. అయితే ఈ షూటింగ్ షెడ్యూల్ వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రంలో నాని సరసన ప్రీతి ముకుందన్ నటించనున్నట్లు ప్రచారం జరుగుతుంది. అలాగే ఈ సినిమాలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించనున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. నాని న్యాచురల్ యాక్టింగ్‌కి, సుజీత్ స్టైలిష్ మేకింగ్ తోడైతే 'బ్లడీ రోమియో' ఎలా ఉండబోతోందన్న ఆసక్తి నెలకొంది.



# ఊటీ చేరుకున్న అనిల్ రావిపూడి టీమ్..!



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్‌ల కాంబోలో తెరకెక్కుతున్న మల్టీ స్టారర్ మూవీ 'జనవరి 12 విడుదల' షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా దూసుకుపోతోంది. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో రాబోతున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ తదుపరి షెడ్యూల్ తాజాగా ఊటీలో మొదలైంది. గత నెలలో మైసూర్‌లో కీలక సన్నివేశాలతో పాటు ఓ కలర్‌ఫుల్ సాంగ్ చిత్రీకరించిన చిత్ర యూనిట్, ఇప్పుడు ఏమాత్రం లేట్ చేయకుండా నేరుగా ఊటీ కొండల్లో వాలింది. ఈ విషయాన్ని స్వయంగా దర్శకుడు అనిల్ రావిపూడి ఓ వీడియో ద్వారా పంచుకుంటూ.. "బ్యూటీఫుల్ ఊటీ షెడ్యూల్ నా అద్భుతమైన టీమ్‌తో మొదలైంది" అంటూ 2027 సంక్రాంతి బరిలో దిగుతున్న విషయాన్ని మరోసారి గుర్తు చేశారు. ఈ సినిమాలో వెంకటేష్ పాత్రే అసలైన హైలైట్‌గా నిలవబోతోందని తెలుస్తుంది. ఇండస్ట్రీలో 40 ఏళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా విడుదలైన వెంకీ మామా ఫస్ట్ లుక్ ఇప్పటికే సినీ లవర్స్‌ను ఆకట్టుకుంది. ఆర్మీ యూనిఫామ్, కళ్లజోడు, మెడలో స్కార్ఫ్‌తో 'లెఫ్టినెంట్ కల్నల్ వెంకట్ రెడ్డి'గా ఆయన కనిపించిన తీరు సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. సాధారణంగా అనిల్ రావిపూడి మార్క్ కామెడీలో వెంకీ కనిపిస్తేనే థియేటర్లలో నవ్వుల పూలు పూస్తాయి.. అలాంటిది మిలిటరీ బ్యాక్‌డ్రాప్‌లో వెంకీ సీరియస్ లుక్, దానికి కళ్యాణ్ రామ్ ఎనర్జీ తోడైతే స్క్రీన్ మీద రచ్చ ఏ రేంజ్‌లో ఉంటుందోనని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేష్ సరసన కీర్తి సురేష్, కళ్యాణ్ రామ్ సరసన కృతి శెట్టి నటిస్తుండటంతో సినిమాపై గ్లామర్ అండ్ పెర్ఫార్మెన్స్ అంచనాలు భారీగా ఉన్నాయి. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ భారీ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం 2027 సంక్రాంతి బరిలో దిగబోతుంది.ఈ మల్టీ స్టారర్ సినిమా బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి.



# బ్రేకప్ అంటే బాధ కాదు..

మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ తన గత ప్రేమాయణం, బ్రేకప్ గురించి మరోసారి స్పందిస్తూ సోషల్ మీడియాలో నెటిజన్ల దృష్టిని ఆకర్షించారు. కొద్ది రోజుల క్రితమే తన మాజీ ప్రియుడు ఎంతో విచిత్రంగా ప్రవర్తించేవాడని, తన వ్యక్తిగత విషయాలతో పాటు సినిమా కెరీర్‌ను కూడా కంట్రోల్ చేయడానికి ప్రయత్నించాడని చెబుతూ సంచలనం సృష్టించారు. తాజాగా, మరోసారి తన బ్రేకప్‌ను గుర్తు చేసుకుంటూ, జీవితంలో ఎదురైన ఆ చేదు అనుభవం గురించి సంచలన వ్యాఖ్యలు చేశారు. సాధారణంగా జీవితంలో ప్రేమ ఎంత అందంగా ఉంటుందో, ఇద్దరు వ్యక్తులు విడిపోవడం కూడా అంతే అందమైన విషయమని అనుపమ అభిప్రాయపడ్డారు.

ఒక పార్ట్‌నర్‌తో విడిపోవడం అనేది ప్రతీ ఒక్కరి జీవితంలో ఒక సహజమైన భాగమేనని ఆమె పేర్కొన్నారు. ఒక బంధం ముగిసిన తర్వాత ఆ వ్యక్తి నుంచి మనం ఎలా దూరమవుతామో, ఆ తర్వాత రోజుల్లో మనల్ని మనం ఎలా మెరుగుపరుచుకుని ఒక మంచి వ్యక్తిగా ఎదుగుతామో అనేది కేవలం ఆ విడిపోవడంతోనే మొదలవుతుందని ఆమె వెల్లడించారు. అందుకే తన కోణంలో చూస్తే బ్రేకప్ అనేది బాధ కాదని.. అది ఎంతో అందంగానే కనిపిస్తుందని స్పష్టం చేశారు. ప్రేమలో విఫలమైనప్పటికీ ధైర్యంగా నిలబడి, తన జీవితాన్ని మరింత అందంగా మలుచుకుంటున్న అనుపమ తీరును చూసి నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

# ఏఏ23 పుకార్లకు చెక్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ వరుస భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. దర్శకుడు అట్లీతో 'రాకా' సినిమాతో పాటు, కోలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్‌తో ఒక మెగా ప్రాజెక్ట్‌ను లైన్‌లో పెట్టిన విషయం తెలిసిందే. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై వర్కింగ్ టైటిల్ AA23తో ఈ సినిమా రూపుదిద్దుకోనుంది. అయితే ఈ కాంబినేషన్ అనౌన్స్‌మెంట్ వచ్చి చాలా రోజులు కావడం, ఆ తర్వాత ఎలాంటి అప్‌డేట్ లేకపోవడంతో ఈ భారీ ప్రాజెక్ట్ క్యాన్సిల్ అయిపోయిందంటూ సోషల్ మీడియాలో రకరకాల రూమర్లు షికారు చేశాయి. ఈ ప్రచారానికి చెక్ పెడుతూ తాజాగా, డైరెక్టర్ లోకేష్ కనగరాజ్, మైత్రీ మూవీ మేకర్స్ సోషల్ మీడియా వేదికగా క్లారిటీ ఇచ్చారు. అల్లు అర్జున్‌తో కలిసి దిగిన ఒక లేటెస్ట్ పిక్‌ను షేర్ చేస్తూ.. ఈ సినిమా ఆగలేదని, మరింత పవర్‌ఫుల్‌గా రూపుదిద్దుకుంటోందని స్పష్టం చేశారు. 'ఏదో భారీ విషయం రూపుదిద్దుకుంటోంది. #AA23 నుంచి త్వరలోనే ఆసక్తికరమైన అప్‌డేట్స్ రాబోతున్నాయి.. వేచి చూడండి' అంటూ క్యాప్షన్‌ను జత చేశారు. ఈ ఒక్క పిక్‌తో ప్రాజెక్ట్‌పై వస్తున్న రూమర్లన్నింటికీ ఒకేసారి తెరపడింది. కాగా.. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి పట్టాలెక్కనున్నట్లు సమాచారం. లోకేష్ కనగరాజ్ క్లారిటీ ఇవ్వడంతో అల్లు అర్జున్ అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.



Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com